ప్రజాశక్తి

మంగళవారం 7 ఫిబ్రవరి 2023

8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

ఆగ్రహించిన అంగన్‌వాడీలు

- విశాఖ, అనకాపల్లి జిల్లా కేంద్రాల్లో భారీ ధర్నాలు
- ఫేస్ యాప్ రద్దు చేయాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్



విశాఖలో నినదిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు

తమ సమస్యల పట్ల అంగన్‌వాడీలు ఆగ్రహించారు. ఫేస్ యాప్ రద్దు చేయాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని పెద్ద పెట్టున నినదించారు. అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు విశాఖ, అనకాపల్లి జిల్లా కేంద్రాల్లో సోమవారం తలపెట్టిన ధర్నాలకు వందలాదిగా తరలివచ్చారు. సమస్యలపై గర్జించారు.

ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం) : జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద భారీ ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో అర్బన్ 1, 2, పెందుర్తి, భీమిలి ప్రాజెక్టుల నుంచి అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, మినీ వర్కర్లు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. వారినుద్దేశించి సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు కెఎం.శ్రీనివాసరావు, విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్ కె ఎస్ వి . కు మా ర్ మాట్లాడారు. అంగన్‌వాడీల సమస్యలు పరిష్కారం కోసం రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల కలెక్టరేట్ల వద్ద ధర్నాలు జరుగుతుంటే.. విశాఖ జిల్లాలో మాత్రం పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించి కలెక్టరేట్‌కు రాకూడదని చెప్పడం దుర్మార్గమన్నారు. అంగన్‌వాడీ లీడర్ల ఇళ్లకు అర్ధరాత్రి వెళ్లి నోటీసులు ఇవ్వడం దారుణమన్నారు. పోలీసులతో, అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం తెలుసుకోవాలన్నారు. అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్.దేవి మాట్లాడుతూ అంగన్‌వాడీ టీచర్లకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఫోన్‌లు పనిచేయటం లేదని, కొన్ని సెంటర్లలో నెట్ సౌకర్యం లేదని, అయినప్పటికీ ఫేస్‌యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలని అధికారులు తీవ్ర ఒత్తిడి చేస్తున్నారని తెలిపారు. ఎంతో కష్టపడుతున్నా తమకు కనీస వేతనం అమలు కావటం లేదన్నారు. మూడు నెలల బకాయి జీతాలు చెల్లించ

మిగతా 2లో..



అనకాపల్లి కలెక్టరేట్ వద్ద ధర్నాలో అంగన్‌వాడీలు



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జగ్గునాయుడు, కుమార్ తదితరులు

ముడసర్లోవ ప్రైవేటుపరంపై ఉద్యమం

సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యం (పిపిపి) పేరిట ముడసర్లోవ పార్కు సంబంధిత 283 ఎకరాల భూమిని వైసిపికి చెందిన ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టేందుకు జివిఎంసిలో అధికార పక్షానికి చెందిన పాలకవర్గం చేసిన నిర్ణయాన్ని నిరసిస్తూ తమ పార్టీ ఆధ్వర్యాన ప్రజా ఉద్యమానికి సిద్ధమయ్యాయని సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు తెలిపారు. పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్‌కెఎస్‌వి.కుమార్, ఆరిలోవ, మద్దిలపాలెం జోన్ కార్యదర్శులు వి.నరేంద్ర కుమార్, వి.కృష్ణారావులతో కలిసి సోమవారం పిఠాపురం కాలనీలోని పార్టీ కార్యాలయంలో ప్రజా ఉద్యమానికి సంబంధించిన పోస్టర్‌ను మంగళవారం ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో జగ్గునాయుడు మాట్లాడుతూ విశాఖ నగర ప్రజలకు ఉపయోగపడే ముడసర్లోవ పార్కును జివిఎంసి పాలకవర్గం వైసిపి కీలక నేత అనుయాయులకు పిపిపి కింద అప్పగించడం దారుణమన్నారు. ఈ నెల 2న జరిగిన జివిఎంసి కౌన్సిల్‌లో ముడసర్లోవ పార్కు, పూర్ణా మార్కెట్‌లను ప్రైవేటుపరం చేసేందుకు వైసిపి పాలకవర్గం ప్రత్యేక అజెండా పెట్టి చర్చించడాన్ని సిపిఎం, సిపిఐ, జనసేన, తెలుగుదేశం కార్పొరేటర్లు వ్యతిరేకించారన్నారు. జివిఎంసి కార్యాలయం వద్ద రెండు రోజుల పాటు వామపక్ష పార్టీలు, ఇతర రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు ఆందోళనలు నిర్వహించాయన్నారు. ముడసర్లోవ పార్కు సమీపాన ఉన్న ఆరిలోవలో ఉండే స్థానికులు సైతం నిరసన వ్యక్తపరిచిన విషయాన్ని గుర్తు చేశారు. ముడసర్లోవ రిజర్వాయర్‌లోకి కొండ ప్రాంతం నుంచి

మిగతా 2లో..

ఎయు విసి అక్రమాలపై విచారణ జరపాలి

వార్త 8లో..

99వ రోజుకు నేవీ నిర్వాసితుల ఆందోళన

వార్త 5లో..

8 నుంచి టార్గెట్ బాల్ పోటీలు

వార్త 3లో..



వర్క్‌షాప్ ముగింపు కార్యక్రమంలో మాట్లాడుతున్న మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు

చట్టసభల్లో మహిళలకు

సమాన ప్రాతినిధ్యం దక్కాలి

- మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు
- విశాఖలో ముగిసిన మహిళా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల వర్క్‌షాప్

వార్త మెయిన్ పేజీలో..

విశాఖ.. సినీ పరిశ్రమకు అనుకూలం

ప్రముఖ దర్శకుడు వివిఎన్.ఆదిత్య

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖ సినీ పరిశ్రమ కేంద్రంగా అభివృద్ధి చెందడానికి ఎన్నో అవకాశాలు ఉన్నాయని ప్రముఖ దర్శకుడు వివిఎన్.ఆదిత్య అన్నారు. ఆంధ్ర యూనివర్సిటీ హిందీ భవన్‌లో సోమవారం ఉదయం వైజాగ్ ఫిల్మ్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. దశాబ్ద కాలంగా వైజాగ్ ఫిల్మ్ సొసైటీ మంచి సినిమాలను వెలికి తీయడంలోనూ, సినిమా విధివిధానాలను తెలియజేయడంలోనూ సఫలీకృతమైందని పేర్కొన్నారు. విశాఖపట్నం, అరకు ప్రాంతాలు సినిమా చిత్రీకరణలకు ఎంతో చక్కనైన ప్రదేశాలన్నారు. మనసంతా నువ్వే చిత్రీకరణ సమయంలోనే విశాఖపట్నంలో ఉన్న అందమైన ప్రాంతాలను తాను చిత్రీకరించిన విషయాన్ని గుర్తు చేశారు. విశాఖలో మౌలిక సదుపాయాలు కల్పించడం ద్వారా మరింతగా సినిమా పరిశ్రమ అభివృద్ధి చెందుతుందని ఆకాంక్ష వ్యక్తం చేశారు.



మీడియాతో మాట్లాడుతున్న దర్శకుడు ఆదిత్య

ప్రభుత్వం సైతం పరిశ్రమకు తగు రీతిలో సహకరించాలన్నారు. వైజాగ్ ఫిల్మ్ సొసైటీ ఆధ్వర్యాన మూడు రోజులపాటు జరగనున్న ఫిలిం ఫెస్టివల్‌లో భాగంగా ఏర్పాటు చేసిన వర్క్‌షాప్‌లో పాల్గొనేందుకు తాను వచ్చానన్నారు. తద్వారా ఇక్కడి వారి ప్రతిభను వెలికితీసేందుకు అవకాశం కలుగుతుందని తెలిపారు. వైజాగ్ ఫిల్మ్ సొసైటీ గౌరవ అధ్యక్షులు ఆచార్య ఎన్ఎడి.పాల్, గౌరవ కార్యదర్శి నరవ ప్రకాశరావు మాట్లాడుతూ వర్క్‌షాప్‌ను యువ లఘు దర్శకులు, సినీ ప్రియులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. సమావేశంలో వైజాగ్ ఫిల్మ్ సొసైటీ ఉపాధ్యక్షులు కాశీ విశ్వేశ్వరరావు, సహాయ కార్యదర్శి బి.చిన్నారావు, కార్యవర్గ సభ్యులు ఆర్.శివకుమార్, సంతోష్ కుమార్ పాల్గొన్నారు.

మొదటి పేజీ తరువాయి..

ఆగ్రహించిన అంగన్‌వాడీలు

లేదని, 2017 నుంచి టిఎ బిల్లులు పెండింగ్ ఉన్నాయని తెలిపారు. అంగ్‌వాడీల వేతనం రూ.12 వేలులోపు ఉన్నప్పటికీ టీచర్‌కుగానీ, ఆయాకుగానీ సంక్షేమ పథకాలు అమలు చేయడం లేదని అన్నారు. యూనియన్ గౌరవ సలహాదారు కె.బృందావతి మాట్లాడుతూ వైఎస్‌ఆర్ సంపూర్ణ పోషణ మెనూ ఛార్జీలు పెంచాలన్నారు. పని ఒత్తిడి తగ్గించాలని, కార్మిక చట్టాలు అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో పి.మణి, ఆర్.శోభారాణి, కె.పద్మావతి, వెంకటలక్ష్మి, భవాని, బి.ఈశ్వరమ్మ, ఆదిలక్ష్మి, పాపవేణి, ఆర్.ఈశ్వరమ్మ, ఎ.సత్య, నాగేశ్వరి పాల్గొన్నారు. ధర్నా శిబిరం వద్దకు అర్బన్ అధికారి శ్రీలత వచ్చారు. ఆమెకు యూనియన్ నేతలు వినతిపత్రం అందజేశారు.

అనకాపల్లి : జిల్లా కలెక్టరేట్ ఎదుట అంగన్‌వాడీలు, హెల్పర్లు భారీ ధర్నా చేపట్టారు. వారినుద్దేశించి సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి జి.కోటేశ్వరరావు మాట్లాడుతూ జగన్ ప్రభుత్వం వస్తే జీతాలు పెరుగుతాయని అంగన్‌వాడీలు ఆశించారని, నేడు జీతాలు పెరగడం మాట అటుంచి పని భారంతో వారంతా తీవ్ర అనారోగ్యాలకు గురవుతున్నారని తెలిపారు. సుప్రీం కోర్టు ఆదేశానుసారం కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని, గ్రాట్యూటీ ఇవ్వాలని, మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. ఐదేళ్లుగా టిఎ, డిఎలు చెల్లించడం లేదని తెలిపారు. విద్యుత్ బిల్లులు చెల్లించాలన్నారు. వైఎస్‌ఆర్ సంపూర్ణ పోషణకు కొన్ని ప్రాజెక్టుల్లో ఆరు నెలలుగా బిల్లులు చెల్లించలేదన్నారు. జిల్లా అధ్యక్షులు ఆర్.శంకరరావు మాట్లాడుతూ విజిట్‌ల పేరుతో అధికారులు, నేతలు అంగన్‌వాడీలను అవమానపరుస్తూ, మానసిక ఒత్తిడికి గురి చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఐదు లక్షలు ఇవ్వాలని, వేతనంలో సగం పింఛన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షురాలు జి.కుమారి, అధ్యక్షురాలు దుర్గారాణి మాట్లాడుతూ వేతనంతో కూడిన మెడికల్ లీవులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. సర్వీసులో ఉండి చనిపోయిన వారి కుటుంబాల్లో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని కోరారు. అనంతరం స్త్రీ శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఉషారాణికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ కోశాధికారి వివి.రమణమ్మ, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ, చేతి వృత్తిదారుల యూనియన్ జిల్లా అధ్యక్షులు గంటా శ్రీరామ్, బుజ్జి, కాసులమ్మ తదితరులు పాల్గొన్నారు.

ముడసర్లోవ ప్రైవేటుపరంపై ఉద్యమం

వచ్చే వర్షపు నీటిని రాకుండా చేసి పెద్ద పెద్ద నిర్మాణాలు చేపట్టే విధంగా, రిజర్వాయర్ తాగునీటిని ఆరిలోవ ప్రజలకు అందకుండా ప్రైవేట్ వ్యక్తుల అవసరాలకు వినియోగించే విధంగా కుట్ర పన్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజలు వ్యతిరేకిస్తున్నా.. ఆరిలోవ ప్రాంతంలోనే ఉన్న మేయర్, వైసిపి కార్పొరేటర్లు దీనిని వ్యతిరేకించకపోవడం శోచనీయమన్నారు. జివిఎంసి పాలకవర్గం చేసిన తప్పుడు నిర్ణయాన్ని ఎండగడుతూ సిపిఎం జిల్లా వ్యాప్తంగా ఉద్యమానికి సిద్ధమవుతోందన్నారు. అందులో భాగంగా ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చేందుకు ఈ నెల 8 నుంచి పోస్టర్లు, కరపత్రాలు, పాదయాత్రలు, గ్రూపు మీటింగ్‌ల ద్వారా మొదటి దశ క్యాంపెయిన్ నిర్వహించనున్నట్టు తెలిపారు. జివిఎంసి ఎన్నికల్లో ప్రజల ఆస్తులను కాపాడతామని, ప్రజలపై భారాలు వేయబోమని ప్రచారం చేసుకున్న వైసిపి నేతలు గెలిచాక చెత్తపన్ను, మురుగునీటి పన్ను, ఆస్తి విలువ ఆధారిత పన్నులు భారీగా విధించి ప్రజలపై విపరీత భారాలు మోపారన్నారు. వీటిపై సిపిఎం విస్తృతంగా పోరాటాలు నిర్వహించడంతో చెత్తపన్ను ప్రజలు చెల్లించకుండా తిరగబడ్డారన్నారు. వైసిపి తన అధికారాన్ని ఉపయోగించుకొని విశాఖ నగర నడిబొడ్డులో ఉన్న కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ స్థలాలను ప్రైవేటు వ్యక్తులకు, అధికార పార్టీ నేతలకు అప్పగిస్తోందన్నారు. ముడసర్లోవ పార్కు అభివృద్ధి పేరుతో ఇప్పటికే రూ.50 కోట్లు ప్రజాధనాన్ని వెచ్చించి, రూ.15 కోట్లతో ప్రహరీ నిర్మాణం చేపట్టి తీరా ప్రైవేట్ వ్యక్తులకు అప్పజెబుతామనడం శోచనీయమన్నారు. వ్యాపారాల కోసం ప్రభుత్వ ఆస్తులను కాజేస్తే ప్రజలు చూస్తూ ఊరుకోరని జగ్గునాయుడు తెలిపారు. ముడసర్లోవ పార్కు జివిఎంసి ఆధీనంలోనే నడపాలని, ఒక్క అంగుళం భూమి కూడా పిపిపి కింద ప్రైవేట్‌వారికి ఇవ్వకుండా ఐక్యంగా అడ్డుకునేందుకు ప్రజలు పోరాటానికి కలిసి రావాలని కోరారు.

జగనన్న ఇళ్ల సమస్యలపై సిపిఐ ధర్నా

ప్రజాశక్తి - కలెక్టరేట్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు నత్తనడకన సాగుతున్నాయని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జెవి.సత్యనారాయణ మూర్తి అన్నారు. జగనన్న ఇళ్ల సమస్యలపై సిపిఐ ఆధ్వర్యంలో సోమవారం విశాఖ జిల్లా కలెక్టరేట్ వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీలు ఏర్పాటు చేసి కనీస మౌలిక సదుపాయాలు కల్పించకపోవడం, ఇళ్ల నిర్మాణాలకు సరిపడిన రీతిలో నిధులు కేటాయించకపోవడంతో కాలనీలు ఎడారులను తలపిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. నేడు పెరిగిన ధరల ప్రకారం ఒక సెంటు స్థలంలో ఇల్లు నిర్మాణం జరగాలంటే కనీసం రూ.7 లక్షలు ఖర్చవుతుందని తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వమే నిర్మాణ వ్యయాన్ని రూ.5 లక్షలకు పెంచి లబ్ధిదారులకు అందించాలని డిమాండ్ చేశారు.

స్కానింగ్ మిషన్ సమస్యపై ఆందోళన

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ఉత్తరాంధ్ర జిల్లాలతో పాటు పొరుగున ఉన్న మరికొన్ని రాష్ట్రాల పేదలకు ఆరోగ్య సేవలు అందిస్తున్న కెజిహెచ్‌లో స్కానింగ్ మిషన్ నెలలు తరబడి పని చేయకుండా ఉన్నప్పటికీ మరమ్మతులు చేయించకుండా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం శోచనీయమని సిఐటియు సీనియర్ నాయకులు వై.రాజు అన్నారు. సోమవారం సిఐటియు జగదాంబ జోన్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంఆర్‌ఐ స్కానింగ్ మిషన్ అన్ని వ్యాధుల నిర్ధారణలో ఎంతో ముఖ్యమన్నారు.



ధర్నా చేస్తున్న సిఐటియు జగదాంబ జోన్ నాయకులు

అటువంటి మిషన్‌ను నిర్లక్ష్యంగా విడిచిపెట్టడం సరికాదన్నారు. కెజిహెచ్‌లో పూర్తి స్థాయిలో వైద్య సేవలు అందివ్వాలన్నారు. కోట్లాది రూపాయలు ఖర్చు చేసే వైద్య పరికరాలు కెజిహెచ్‌లో ఉన్నా, అవి పని చేయలేని పరిస్థితిలో ఉన్నాయని తెలిపారు. బిపి, సుగర్, మూర్ఛ వంటి వ్యాధులకు కూడా మందులు ఇక్కడ లేవన్నారు. కోట్లాది రూపాయలను ఆరోగ్యశ్రీ పథకం కింద ఖర్చు చేస్తూ కార్పొరేట్ ఆసుపత్రులకు ప్రభుత్వం దోచిపెడుతోందని, అదే డబ్బును కెజిహెచ్‌కు ఎందుకు ఖర్చు చేయరని ప్రశ్నించారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో సంఘం జోన్ నాయకులు ఎం.సుబ్బారావు, కెవిపి.చంద్రమౌళి, కె.నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

బిఆర్‌టిఎస్ రోడ్డులో పెట్టిన కేసులు ఎత్తేయాలి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : పెందుర్తి నుంచి కంచరపాలెం మెట్టు వరకు చాలా రద్దీగా ఉండే ప్రాంతంలో ఉన్న బిఆర్‌టిఎస్ రోడ్డు మధ్య భాగం గుండా వెళ్లిన కార్లకు భారీ ఎత్తున విధించిన జరిమానాలను రద్దు చేయాలని, పెట్టిన కేసులను ఎత్తివేయాలని విశాఖ క్యాబ్ ఓనర్స్ అండ్ డ్రైవర్స్ యూనియన్ (సిఐటియు) గౌరవ అధ్యక్షులు బి.జగన్ డిమాండ్ చేశారు. సోమవారం స్పందనలో ఈ మేరకు జాయింట్ కలెక్టర్ విశ్వనాథన్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిఆర్‌టిఎస్ సర్వీసు రోడ్లలో మాత్రమే అన్ని వాహనాలూ వెళ్ళాలని. మధ్య రోడ్డులో ఆర్‌టిసి బస్సులు మాత్రమే వెళ్ళాలని షరతు పెట్టారన్నారు. అయితే సర్వీసు రోడ్లు ఎప్పుడూ రద్దీగా ఉంటున్నాయని, మధ్య రోడ్డు మాత్రం పూర్తిగా ఖాళీగా ఉంటోందని తెలిపారు. ఈ విషయంపై గతంలో కలెక్టర్‌ను కలిసినప్పుడు సిపితో చర్చించి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారన్నారు. కానీ ఇప్పుడు రద్దీ టైంలో కార్లు మధ్య రోడ్డులో వెళ్లాయని పేర్కొంటూ ఒక్కొక్క కారుకు రూ.2030 జరిమానా వేస్తున్నారని తెలిపారు. ఇప్పటికే పెట్రోల్, డీజిల్ ధరలు, ఇతర ఆర్‌టిఓ చలానాలు, ఛార్జీలు పెరగడంతో కారు డ్రైవర్లు బతకడం కష్టంగా మారిందన్నారు. ఈ నేపథ్యంలో ప్రస్తుత సమస్యను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు సిహెచ్.శ్రీనివాస్, పి.శ్రీరాములు, ఉపాధ్యక్షులు నాయుడు, సభ్యులు శరత్, అప్పలరాజు పాల్గొన్నారు.

లోకేష్ పాదయాత్రను ఆపలేరు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : వైసిపి ప్రభుత్వం ఎన్ని అడ్డంకులు, అవరోధాలు కల్పించినా టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పాదయాత్ర 4 వేల కిలోమీటర్ల మేర జరిగి తీరుతుందని ఆ పార్టీ విశాఖ దక్షిణ నియోజకవర్గం ఇన్‌ఛార్జి గండి బాబ్జీ స్పష్టం చేశారు. సోమవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ లోకేష్ యువగళం పాదయాత్రకు ప్రభుత్వం ఇబ్బందులు కలుగజేస్తోందన్నారు.

ఎపిఎఫ్‌ఆర్‌ఎస్‌తో తీవ్ర నష్టం

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ఎపిఎఫ్‌ఆర్‌ఎస్ విధానం జివిఎంసికి, కార్మికులకు ఎంతో నష్టదాయకమని, తక్షణం దీన్ని నిలుపుదల చేయాలని జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు టి.నూకరాజు, యు.రాజు విజ్ఞప్తి చేశారు. సోమవారం జివిఎంసి అడిషనల్ కమిషనర్‌కు, ప్రధాన వైద్యాధికారికి యూనియన్ తరుపున వినతి పత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎఫ్‌ఆర్‌ఎస్ విధానాన్ని ఫీల్డ్‌లో పనిచేసే పర్మినెంట్, అవుట్ సోర్సింగ్ కార్మికులను మినహాయించాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ డిప్యూటీ కార్యదర్శి ఎంవి.ప్రసాదరావు, తదితరులు పాల్గొన్నారు.

ముడసర్లోవ భూముల రక్షణకు కరపత్రాల పంపిణీ

ప్రజాశక్తి - ఆరిలోవ : వంద ఏళ్ళుగా ఆరిలోవ పరిశర ప్రాంతాలకు తాగునీటిని అందించే ముడసర్లోవ రిజర్వాయర్‌కు చెందిన భూములను కాపాడుకోవాలని సిపిఎం పిలుపునిచ్చింది. ఈ మేరకు సోమవారం సిపిఎం ఆరిలోవ జోన్ కమిటీ ఆధ్వర్యాన మహిళలు సోమవారం ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంచుతూ, స్థానికులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు బి.సూర్యమణి, ఎస్.రంగమ్మ మాట్లాడుతూ, ముడసర్లోవ పార్కు అభివృద్ధి పేరుతో రిజర్వాయర్ భూములను ప్రయివేటు వ్యక్తులకు కట్టబెట్టాలని వైసిపి ప్రభుత్వం చూస్తుందన్నారు. దీనిపై ఎంతటి పోరాటానికైనా సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ పోరాటంలో ప్రజలు భాగస్వాములు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో రమణమ్మ, శాంతి, కాంతం, అరుణ తదితరులు పాల్గొన్నారు.

8 నుంచి టార్గెట్ బాల్ పోటీలు

ప్రజాశక్తి-మధురవాడ : అసోసియేషన్ ఆఫ్ ఇండియన్ యూనివర్సిటీస్ (ఎఐయు) ఆధ్వర్యాన గీతం విశ్వవిద్యాలయంలో ఈ నెల 8 నుంచి 10వ తేదీ వరకు అఖిల భారత అంతర్ విశ్వవిద్యాలయాల టార్గెట్ బాల్ పోటీలు (పురుషుల విభాగం) నిర్వహించనున్నట్లు గీతం క్రీడా విభాగం డైరక్టర్ అరుణ్‌కార్తీక్ తెలిపారు. గీతంలో సోమవారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఈ పోటీల్లో దేశంలోని 29 విశ్వవిద్యాలయాల నుంచి 350 మంది క్రీడాకారులు పాల్గొంటారని వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ నుంచి గీతం, ఆంధ్ర, నాగార్జున, కెఎల్‌యు విశ్వవిద్యాలయాలతో పాటు ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం అండ్ ఎనర్జీ జట్లు పాల్గొంటాయని తెలిపారు. విలేకర్ల సమావేశంలో గీతం క్రీడా విభాగం డిప్యూటీ డైరక్టర్ శ్రీనివాస్, మేనేజర్ రితేష్ సిన తదితరులు పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న అరుణ్‌కార్తీక్

మార్షల్ ఆర్ట్స్‌లో విద్యార్థులకు పతకాలు


పతకాలు సాధించిన విద్యార్థులతో కోచ్‌లు


ప్రజాశక్తి- తగరపువలస : విశాఖ నగరంలోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ భవన్‌లో ఇటీవల జరిగిన రాష్ట్ర స్థాయి కరాటే చాంపియన్ షిప్-2023 పోటీల్లో స్థానిక విద్యార్థులు పలు పతకాలు సాధించారు. స్థానిక పిఎన్ఆర్ మార్షల్ ఆర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యాన శిక్షణ పొందిన విద్యార్థులు తమ్మిన పవన్, తేజ్ చెరో బంగారు, రజత పతకాలు సాధించారు. ఎం.తేజేష్ రెండు బంగారు పతకాలు, జి చైతన్య రెండు రజత పతకాలు, లియోవల్, మెస్సీ చెరో రజత , కాంస్య పతకాలు, బి.ఇషా, శర్వాణి చెరో రజత, కాంస్య పతకాలు సాధించినట్లు నిర్వాహకులు తెలిపారు. పతకాలు సాధించిన వారిని పిఎన్ఆర్ మార్షల్ ఆర్ట్స్ చీఫ్ పి నరసింగరావు, కోచ్ జి.శివరామకృష్ణ, కోచ్, బ్లాక్ బెల్ట్ గ్రహీతలు బి.పరదేశి, గౌతమ్, స్థానికులు తమ్మిన అశోక్ కుమార్ తదితరులు అభినందించారు.

52వ వార్డులో అభివృద్ధి పనుల పరిశీలన

ప్రజాశక్తి-కరాస: జివిఎంసి 52వ వార్డులో జరుగుతున్న అభివృద్ధి పనులను డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ సోమవారం పరిశీలించారు. వార్డులోని కరాస హిందూ, ముస్లిం, క్రైస్తవ శ్మశాన వాటిక, పలు పార్కులలో చేస్తున్న అభివృద్ధి పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఉడా లే-అవుట్ గ్రీన్ బెల్ట్‌లో వాకింగ్ ట్రాక్ పునరుద్ధరణపై అధికారులతో చర్చించారు. నిర్మాణ పనుల నాణ్యతలో ఎటువంటి లోపాలు లేకుండా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిఇ ఏడుకొండలు, ఎఇ ఉష, వార్డు సచివాలయ సెక్రటరీలు, పారిశుధ్య విభాగం ఇన్‌స్పెక్టర్, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


శ్మశానాన్ని పరిశీలిస్తున్న డిప్యూటీ మేయర్ శ్రీధర్

డాక్టరేట్ గ్రహీతకు సన్మానం


బాలసుబ్రహ్మణ్యం దంపతులను సన్మానిస్తున్న రవికుమార్ తదితరులు

ప్రజాశక్తి-పద్మనాభం : సియాా వేదిక్ కల్చర్ రీసెర్చ్ యూనివర్సిటీ, స్ఫూర్తి సర్వీసెస్ సొసైటీ ఇండియా, ఎన్‌జిఒ సంయుక్తంగా డాక్టరేటును అందించిన మండలంలోని మద్ది గ్రామానికి చెందిన పురోహితుడు బాలసుబ్రహ్మణ్యాన్ని సోమవారం పద్మనాభంలో సన్మానించారు. స్థానికంగా ఉన్న రూపాకులు రవికుమార్ తన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం బాలసుబ్రహ్మణ్యం దంపతులను ప్రత్యేకంగా సన్మానించారు. బాలసుబ్రహ్మణ్యంనకు చిన్నతనంలో విద్య నేర్పిన గురువును కూడా పిలిచి సన్మానించారు. వీరితో పాటు బాలసుబ్రహ్మణ్యంనకు పద్యరంగంలో గురువుగా ఉన్న లోకిరెడ్డి కృష్ణమూర్తి, చంద్రకళ పాత్ర పోషించిన సంగిరెడ్డి గౌరీశ్వరి, తోటి గాయకులనూ సన్మానించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి -మధురవాడ : మధురవాడ విద్యుత్ ఫీడర్ మరమ్మతులు కారణంగా మంగళవారం పలు ప్రాంతాలకు సరఫరాను నిలిపేస్తున్నట్లు డిఇ పోలాకి శ్రీనివాసరావు తెలిపారు. మధురవాడ మెయిన్ రోడ్డు, ఎంఎన్ఆర్ లే-అవుట్, సాయి ప్రియ లే-అవుట్, చంద్రంపాలెం, భాస్కర్ నగర్, సంపత్ నగర్, ఉజ్వల హాస్పిటల్ ఏరియా, వల్లీనగర్ ప్రాంతాలకు మంగళవారం ఉదయం 9.00 నుంచి మధ్యాహ్నం 3:00 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించి సహకరించాలని శ్రీనివాసరావుతోపాటు ఎఇ శ్రీరామ్మూర్తి కోరారు.

వెంకటేశ్వరస్వామి ఆలయంలో పుష్పయాగం

ప్రజాశక్తి- సింహాచలం: సింహాచలం దేవస్థానానికి అనుబంధంగా కొండ దిగువన ఉన్న వెంకటేశ్వర స్వామి ఆలయంలో పుష్ప యాగం కార్యక్రమాన్ని అర్చకులు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ బోర్డు సభ్యులు దినేష్‌రాజ్, ఆలయ అర్చకులు భార్గవ్, ఇతర అర్చక సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

సింహగిరిపై తాగుబోతు వీరంగం

ప్రజాశక్తి-సింహాచలం: సింహగిరి కొండపై ఓ తాగుబోతు వీరంగం సృష్టించాడు. తాగిన మైకంలో వచ్చి పోయే భక్తులపై సీసాలో ఉన్న నీరు చల్లుతూ తీవ్ర అసౌకర్యానికి గురి చేశాడు. ఈ విషయాన్ని గమనించిన దేవస్థానం సెక్యూరిటీ సిబ్బంది అక్కడికి చేరుకొని తాగుబోతు చేతిలో ఉన్న వాటర్ బాటిల్ తీసుకున్నారు. తాగుబోతు మరో వాటర్ బాటిల్‌తో వచ్చి భక్తులపై నీరు జల్లడం మొదలుపెట్టాడు. సెక్యూరిటీ సిబ్బంది వచ్చి తాగుబోతును మెట్ల మార్గంలోకి తీసుకెళ్లి విడిచిపెట్టారు.


గౌరవ వేతనం అందుకున్న పాఠశాల సిబ్బంది

గౌరవ వేతనాల అందజేత

ప్రజాశక్తి -తగరపువలస, మధురవాడ : ఎండాడ ప్రభుత్వ అంధ బాలికల ఆశ్రమ పాఠశాలలో నియమితులైన ఉపాధ్యాయులు, విద్యా వాలంటీర్లకు, ముగ్గురు సహాయకులకు గత నెల గౌరవ వేతనం రూ.55 వేలును దివీస్ సిఎస్ఆర్ అధికారి నాగరాజు సోమవారం అందజేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.మహేశ్వరరెడ్డి ద్వారా సిబ్బందికి అందించారు. ఈ సందర్భంగా నాగ రాజు మాట్లాడుతూ గత తొమ్మిదేళ్లుగా అదనంగా నియమితులైన పాఠశాల సిబ్బందికి దివీస్ సహాయం అందజేస్తున్న ట్లు వివరించారు.

ప్రకృతి వ్యవసాయంతో మేలు

ప్రజాశక్తి-పద్మనాభం : ప్రకృతి వ్యవసాయ పంటల ద్వారా ఆరోగ్యం బాగుంటుందని కోరాడ సర్పంచ్ కోరాడ లక్ష్మణరావు తెలిపారు. పద్మనాభం మండలంలోని కోరాడ గ్రామంలో చందక వారి కళ్లాల వద్ద ప్రకృతి వ్యవసాయ సాగుపైన రైతులకు అవగాహన కల్పించారు. రసాయనిక ఎరువులు వాడకున్నా పంటను పండించే పద్ధతిని వివరించారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడి సాధించవచ్చని తెలిపారు. సేంద్రీయ ఎరువుల తయారీని చేసి చూపించారు. ఈ కార్యక్రమములో ప్రకృతి వ్యవసాయ అధికార్లు అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

కొట్లాటలో పలువురికి గాయాలు

ప్రజాశక్తి-ఆనందపురం : మండలంలోని సొంట్యాం పంచాయతీ ఎన్‌జిఆర్ పురం-1లో ఆదివారం అర్ధరాత్రి భూ వివాదంలో జరిగిన కొట్లాటలో పలువురికి గాయాలయ్యాయి. ఘటనకు సంబంధించి స్థానికుల కథనం ప్రకారం... సొంట్యాం పంచాయతీ గొంతివానిపాలెం గ్రామానికి చెందిన ప్రసాదునాయుడు, సారిపల్లి నూకమ్మ, ప్రసాదు కన్నమ్మ, ప్రసాదు రాము, సారిపల్లి అప్పలరాజులకు ఎన్‌జిఆర్ పురం సర్వే నెంబరు 12 / 8 లో 25 సెంట్లు స్థలం ఉంది. ఈ స్థలం పక్కన రవిరేష్ పెట్రోల్ బంక్ యజమాని పర్వతనేని సురేష్ బంకు ఉంది. బంకు పక్కన ఉన్న ఈ స్థలంపై కన్ను పడిన సురేష్ గతంలో అనేకసార్లు బెదిరించినట్లు స్థల యజమానులు చెబుతున్నారు. ఈ క్రమంలో ఆదివారం అర్ధరాత్రి 1:30 సమయంలో సుమారు వందమంది గుండాలను తీసుకొచ్చి స్థలంలో ఉన్న ప్రసాద్‌నాయుడు కుటుంబ సభ్యులను, మరి కొంతమందిని బెదిరించి కర్రలతో దాడి చేశారు. ఈ క్రమంలో ప్రసాద్ నాయుడుతో పాటు వారి కుటుంబ సభ్యులు, మహిళలు తీవ్ర గాయాలపాలయ్యారు. బాధితులు ప్రసాద్‌నాయుడు అర్ధరాత్రి 100కు డయల్ చేయగా స్పందించకపోవడంతో ఎసిపిని సంప్రదించారు. ఎసిపి ఆదేశాల మేరకు స్థానిక పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని బాధితులను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. దౌర్జన్యంపై కేసు నమోదు చేసి విచారణ జరుగుతున్నట్లు పోలీసులు తెలిపారు.

స్టీల్‌ప్లాంట్‌లో కాంట్రాక్టు కార్మికునికి తీవ్రగాయాలు

ప్రజాశక్తి-ఉక్కునగరం : స్టీల్‌ప్లాంట్ ఎస్ఎంఎస్ విభాగంలో జరిగిన ప్రమాదంలో కాంట్రాక్టు కార్మికుడు ఎం.మురళీకృష్ణ తీవ్రంగా గాయపడ్డాడు. సోమవారం సాయంత్రం వెనకనుంచి ఫోర్క్ లిఫ్ట్ ఢీకొట్టడంతో కాలు నుజ్జయింది. ప్రమాదం జరిగిన వెంటనే ఫస్ట్ ఎయిడ్ విభాగానికి తరలించారు. అక్కడి నుంచి మల్కాపురంలోని ఇఎస్ఐ ఆసుపత్రికి తరలించారు. స్టీల్‌ప్లాంట్ పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి పోలీసులు చేరుకుని వివరాలు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. లంకెలపాలెంలో ఉంటున్న బాధితునికి న్యాయం చేయాలని తోటి ఉద్యోగులు డిమాండ్ చేస్తున్నారు.


ప్రతిజ్ఞ చేస్తున్న వైసిపి నాయకులు

గృహ సారథులతో సమీక్షా సమావేశం

ప్రజాశక్తి - ఆరిలోవ : ఆరిలోవ, తోటగరువు వెర్రిదుర్గాంబ ఆలయం వద్ద గల కల్యాణమండపంలో 12, 13 వార్డుల గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు, వాలంటీర్లతో వైసిపి నాయకులు సోమవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తూర్పు నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త అక్కరమాని విజయనిర్మల, నియోజవర్గ పరిశీలకులు, మాజీ ఎమ్మెల్సీ సూర్యనారాయణరాజు, సీనియర్ నాయకులు గొలగాని శ్రీనివాసరావు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, అర్హులైన వారికి పథకాలు అందేలా కృషి చేయాలని కోరారు. రానున్న ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు అక్కరమాని రోహిణి, కెల్ల సత్యనారాయణ, ముప్పల లక్ష్మి, నాయకులు కెల్ల సత్యనారాయణ, సత్తి మందారెడ్డి, కన్నేటి సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

ఫుట్‌బాల్ క్రీడాకారులకు దుస్తులు

ప్రజాశక్తి -తగరపువలస : సీనియర్ ఫుట్‌బాల్ క్రీడాకారుడు ఎం.రాంజీ సొంత నిధులతో సమకూర్చిన క్రీడా దుస్తులను పలువురు ఫుట్‌బాల్ క్రీడాకారులకు సోమవారం పంపిణీ చేశారు. చిట్టివలస ఫుట్‌బాల్ గ్రౌండ్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో ఫుట్‌బాల్ క్రీడాకారులు జె.అప్పలకృష్ణ, పి.శ్రీనివాసరావు, కె.రాంబాబు, శివ, శ్రీ పోలమాంబ ఫుట్‌బాల్ క్లబ్ కార్యదర్శి అక్కరమాని చినబాబు పాల్గొన్నారు.

టిఎస్ఆర్, టిబికెలో న్యాయ సదస్సు

ప్రజాశక్తి -గాజువాక : గాజువాక శ్రీనగర్‌లోని టిఎస్ఆర్, టిబికె కళాశాలలో సోమవారం న్యాయ సదస్సు నిర్వహించారు. విద్యార్థులకు చట్టాలపై విశ్రాంత న్యాయమూర్తి డి.శౌర్యభీమారావు అవగాహన కల్పించారు. ఏ చట్టాలు ఏ విధంగా ఉపయోగపడతాయనేది క్షుణ్ణంగా వివరించారు. విశ్రాంత జిల్లా ప్రధాన న్యాయమూర్తి లక్ష్మీకామేశ్వరి మాట్లాడుతూ, భారతదేశంలో విడాకుల సంఖ్య పెరిగిపోతుందని, ఇది మంచిది కాదని అభిప్రాయపడ్డారు. ప్రతి ఒక్కరికీ చట్టంపై అవగాహన ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఛైర్మన్ బలరామకృష్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.

గంగవరం పోర్టు కాలుష్యంపై సిపిఎం ధర్నా



ధర్నాలో సిపిఎం నాయకులు రాజేంద్రప్రసాద్, రాంబాబు తదితరులు

ప్రజాశక్తి- గాజువాక: గంగవరం పోర్టు కాలుష్యం నివారించాలని, ప్రజలు ఆరోగ్యాలు కాపాడాలని కోరుతూ జివిఎంసి 76వ వార్డు పరిధి స్వతంత్రనగర్‌లోని వై జంక్షన్ వద్ద సిపిఎం ఆధ్వర్యాన సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం గాజువాక జోన్ కార్యదర్శి రాంబాబు మాట్లాడుతూ, గంగవరం పోర్టు కాలుష్యం వల్ల సుమారు 10 గ్రామాలు ప్రజలు తీవ్ర అనారోగ్యాలకు గురవుతున్నారన్నారు. పొల్యూషన్ కంట్రోల్ బోర్డు నిబంధనలను గంగవరం పోర్టు యాజమాన్యం పాటించకుండా కాలుష్యాన్ని ప్రజలపై వదులుతూ అనారోగ్యానికి గురిచేస్తోందని తెలిపారు. పోర్టు లాభాలు అదానీకి, రోగాలు ప్రజలకా అంటూ ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ పోర్టు కాలుష్యం వల్ల వై.జంక్షన్‌లో ద్విచక్ర వాహన దారులు ఇబ్బందులు పడుతున్నారని, పలుమార్లు ప్రమాదాలు కూడా చోటుచేసుకుంటున్నాయని తెలిపారు. కనీసం బొగ్గు లారీలపై తార్పాలిన్లను కూడా వేయకుండా పంపిస్తున్నారని పేర్కొన్నారు. గంగవరం పోర్టు యాజమాన్యంపై రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని, కాలుష్యానికి గురవుతున్న గ్రామాలను గంగవరం పోర్టు యాజమాన్యం దత్తత తీసుకొని ప్రజలు ఆరోగ్యానికి అయ్యే ఖర్చు భరించాలని డిమాండ్ చేశారు. కాలుష్యానికి గురవుతున్న గ్రామాల్లో ఉచిత మెడికల్ క్యాంపులను యాజమాన్యం నిర్వహించాలని కోరారు. రామచంద్రనగర్ డంపింగ్‌యార్డుపై శనివారం ధర్నా చేస్తామని, దాన్ని పూర్తిగా తరలించేవరకు రిలే నిరాహార దీక్షలు కూడా చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఎన్.రాజేంద్రప్రసాద్, లోకేష్, డి.రమణ, లక్ష్మి, శ్రీదేవి, సుబ్బారావు, రాజారావు, అర్జునరావు, పలు గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.




36 గంటల దీక్షలో కూర్చున్న ఎఐటియుసి, మిత్రపక్షాల నాయకులు

నూతన వేతనాల అమలుకు 36 గంటల దీక్ష

ప్రజాశక్తి-ఉక్కునగరం : ఉక్కు నూతన వేతన ఒప్పందం వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఏఐటీయూసీ, మిత్రపక్షాల యూనియన్ల ఆధ్వర్యాన ఉక్కునగరం పరిపాలన విభాగం వద్ద 36 గంటల నిరాహార దీక్ష చేపట్టాయి. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ, నూతన వేతన ఒప్పందం అమలుచేయడంలో ఉక్కు యాజమాన్యం విఫలమైందన్నారు. యాజమాన్యం నిర్లక్ష్య చర్యల వల్ల జూనియర్ కార్మికులకు తీవ్ర నష్టం జరుగుతుందని తెలిపారు.

విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను నిర్వీర్యం చేసేందుకు మోడీ ప్రభుత్వం కుట్ర పన్నిందన్నారు. ఉక్కు కర్మాగారం నష్టాల పేరుతో ప్రయివేటీకరణ చెయ్యాలని చూస్తుందని ఆరోపించారు. స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు. నిరాహార దీక్షలో యూనియన్ నాయకులు కె.శ్రీనివాసరావు, విళ్లా రామ్మోహనరావు, పి.పెంటారావు, సోమునాయుడు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



సంక్షేమ పథకాల కరపత్రాలను అందిస్తున్న కెకె.రాజు తదితరులు

25వ వార్డులో గడపగడపకు మన ప్రభుత్వం

ప్రజాశక్తి-సీతమ్మధార : జివిఎంసి 25వ వార్డు పరిధి సీతంపేట, కృష్ణుడిగుడి, రాజేంద్రనగర్, పిండి మిల్లు తదితర ప్రాంతాల్లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఉత్తర నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త కెకె.రాజు, వార్డు కార్పొరేటర్ సారిపిల్లి గోవిందరావు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. ప్రజల సమస్యలనడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కెకె.రాజు మాట్లాడుతూ, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ఈ ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. అర్హత గల వారిని గుర్తించి సంక్షేమ ఫలాలను వారి ఇళ్లకే అందించేలా జగన్మోహన్‌రెడ్డి కృషిచేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో 25వ వార్డు నాయకులు భోగవల్లి గోవింద్, సానబోయిన సురేష్, పోతుబంతి హరికృష్ణ, కె.వేణుగోపాల్, సేమట్ల వెంకటేష్, 14 వార్డు కార్పొరేటర్ కె.అనీల్‌కుమార్‌రాజు, కిరణ్‌రాజు, షేక్ బాబ్జి, అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత

ప్రజాశక్తి -గాజువాక : మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. జీవీఎంసీ 74వ వార్డు పరిధిలో కాలువ నిర్మాణానికి సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎన్నికల ముందు ఇచ్చిన హామీల్లో భాగంగా వార్డుల్లో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలో పెండింగ్ పనులు త్వరలో పూర్తిచేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి, ఎన్‌వి.నాయుడు, పైడికొండ, తాతారావు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

తెలుగు సినిమా ఉత్సవం ప్రారంభం



కె.విశ్వనాథ్, జమున చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న ప్రతినిధులు

ప్రజాశక్తి-సీతమ్మధార : తెలుగు తొలి సినిమా భక్త ప్రహ్లాద 1932 ఫిబ్రవరి 6న విడుదల అయి నేటికీ 91ఏళ్ళు పూర్తి అయిన సందర్భంగా వైజాగ్ ఫిల్మ్ సొసైటీ ఆధ్వర్యాన మూడు రోజుల పాటు తెలుగు సినిమా ఉత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు వైజాగ్ ఫిలిం సొసైటీ కార్యదర్శి నరవ ప్రకాశరావు తెలిపారు. ఈ ఉత్సవాన్ని పౌర గ్రంథాలయంలో దర్శకుడు విఎన్ ఆదిత్య సోమవారం ప్రారంభించారు. తొలుత కె.విశ్వనాథ్, జమున ఫొటోలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం దర్శకుడు ఆదిత్య మాట్లాడుతూ, మానవ విలువలను స్పృశించే సినిమాలను ప్రజలకు చేరువ కావాలని వైజ్ ఫిల్మ్ సొసైటీ చేస్తున్న కృషి అభినందనీయం అన్నారు. విశాఖ ఫిల్మ్ పరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం స్పందించి చొరవ తీసుకోవాలని, సినీ ప్రేక్షకులు ఒక కమిటీగా ఏర్పడి పాలకులపై ఒత్తిడి తేవాలని సూచించారు. తాను ఇక్కడే చదువుకున్నానని, విశాఖపై పూర్తి అవగాహన ఉండటంతో తన చిత్రాలను ఎక్కువగా ఇక్కడే తీస్తుంటానని తెలిపారు.

పారిశ్రామికవేత్త భరణికాన రామారావు మాట్లాడుతూ, ప్రజలు మంచి సినిమాలు చూసే అలవాటు చేసుకోవాలన్నారు. సొసైటీ ఆధ్వర్యాన ప్రదర్శిస్తున్న చిత్రాలను తిలకించాలని కోరారు. అనంతరం కె.విశ్వనాథ్ దర్శకత్వంలో రూపొంది జమున నటించిన ఉండమ్మా బొట్టు పెడతా చిత్రాన్ని ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో వైజాగ్ ఫిల్మ్ సొసైటీ అధ్యక్షులు ఆచార్య ఎన్‌ఎడి పాల్, కార్యదర్శి, కాశీ విశ్వేశ్వరరావు, సుసర్ల శ్రీనివాస్, బి.చిన్నారావు తదితరులు పాల్గొన్నారు. మంగళవారం ఉదయం 10 గంటలకు విఎన్.ఆదిత్యతో ఫిల్మ్ మేకింగ్ వర్క్ షాప్, సాయంత్రం 5.30 గంటలకు గూడవల్లి రామబ్రహ్మం రూపొందించిన 1938 మాల పిల్ల ప్రదర్శన ఉంటాయని కార్యనిర్వాక సభ్యులు తెలిపారు. విశాఖపట్నం ప్రజలు ఉచితంగా తిలకించవచ్చని పేర్కొన్నారు.

ముగిసిన రామచంద్రరావు అంత్యక్రియలు

ప్రజాశక్తి -గాజువాక : గాజువాక లక్ష్మీకాంత్ సినిమా థియేటర్, రామచంద్ర హోటల్ గ్రూప్ ఆఫ్ అధినేత జి.రామచంద్రరావు ఆదివారం రాత్రి మృతి చెందారు. ఆయన అంత్యక్రియలను జోగవానిపాలెం శ్మశాన వాటికలో సోమవారం నిర్వహించారు. మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, కార్పొరేటర్లు, పలువురు పారిశ్రామికవేత్తలు, బంధువులు హాజరయ్యారు.



రవీంద్రరెడ్డికి స్వాగతం పలుకుతున్న నాయకులు

సైకిల్‌యాత్రకు స్వాగతం

ప్రజాశక్తి-పెందుర్తి : ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షిస్తూ ప్రపంచ సోలో సైకిల్ యాత్ర చేస్తున్న బొబ్బ రవీంద్రరెడ్డికి పెందుర్తి ప్రధాన కూడలిలో 96వ వార్డు కార్పొరేటర్ పీలా శ్రీనివాసరావు, 75వ వార్డు నాయకులు పులి వెంకటరమణారెడ్డి, స్టీల్‌ప్లాంట్ హెచ్‌ఎంఎస్ యూనియన్ నాయకుడు దొమ్మేటి అప్పారావు ఘన స్వాగతం పలికారు. పూలదండలువేసి, సాలువతో సత్కరించారు. ఈ సందర్భంగా సైకిల్ యాత్ర నిర్వహిస్తున్న బొబ్బ రవీంద్రరెడ్డి మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా జీవించాలని ప్రపంచ సోలో సైకిల్ యాత్ర ప్రారంభించానని తెలిపారు. ప్రతి ఒక్కరూ రోజూ నడవడం, సైకిల్ తొక్కడం, యోగా చేయడం, మంచి ఆహారం తీసుకోవడం అలవాటు చేసుకుంటే ఆనందంగా జీవించవచ్చని తెలిపారు. ఇప్పటివరకు సైకిల్‌యాత్ర ద్వారా ప్రపంచ దేశాలను ఎవరూ చుట్టలేదని, తాను 6898 కిలోమీటర్ల ప్రపంచ సోలో సైకిల్ యాత్ర చేసి గిన్నిస్ రికార్డు సాధిస్తానని చెప్పారు. తన యాత్ర జనవరి 7వ తేదీన చెన్నైలో ప్రారంభించానని, చెన్నై నుంచి ముంబై, కోల్‌కతా మీదుగా ఆంధ్రప్రదేశ్‌లో ఇచ్ఛాపురంలో ప్రవేశించానని తెలిపారు. సోమవారం నాటికి పెందుర్తి ప్రాంతానికి చేరుకోవడం తనకెంతో ఆనందంగా ఉందన్నారు. తిరిగి తన యాత్రను చెన్నైతో ముగిస్తానని తెలిపారు. తాను గేయిల్ కంపెనీలో మార్కెటింగ్ మేనేజర్‌గా పనిచేస్తున్నానని చెప్పారు.

ప్రజల డబ్బు అదానీకి ధారాదత్తంపై కాంగ్రెస్ నిరసన

ప్రజాశక్తి -గాజువాక : స్టేట్‌బ్యాంక్, ఎల్‌ఐసిలో ప్రజలు దాచుకున్న డబ్బును అదానికి దారాదత్తం చేయడాన్ని వ్యతిరేకిస్తూ కణితిలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎదుట కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యాన సోమవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ గాజువాక ఇన్‌ఛార్జి జెర్రిపోతుల ముత్యాలు మాట్లాడుతూ, ప్రజలు దాచుకున్న డబ్బును కేంద్ర ప్రభుత్వం అదానీకి అప్పజెప్పడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో గాజువాక కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

హర్షవర్ధన్‌రెడ్డికి వైసిపి నేతల సన్మానం



హర్షవర్ధన్‌రెడ్డిని సత్కరిస్తున్న దామోదర్ తదితరులు

ప్రజాశక్తి -గాజువాక : ఉత్తరాంధ్ర జిల్లాల సచివాలయ కో-ఆర్డినేటర్ అన్నపురెడ్డి హర్షవర్ధన్‌రెడ్డిని ఎమ్మెల్యే నాగిరెడ్డి సమక్షంలో వైసిపి నాయకులు దామోదర్ ఆధ్వర్యాన సోమవారం గాజువాకలో సన్మానించారు. మొదటిసారి గాజువాక రావడంతో పుష్పగుచ్ఛం అందజేసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో దుగ్గపు దానప్పలు, బొండా గోవిందరాజులు, ప్రగడ వేణుబాబు తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఇజెడ్‌లో భద్రతా ప్రమాణాలు పాటించని

కంపెనీల యాజమాన్యాలపై చర్యలకు వినతి

ప్రజాశక్తి-అచ్యుతాపురం

ఎస్ఈజెడ్‌లోని పరిశ్రమలలో భద్రతా ప్రమాణాలు చేపట్టని యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకోవాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్ రాము, కోశాధికారి వివి.శ్రీనివాసరావు సోమవారం అనకాపల్లి జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఫార్మా పరిశ్రమలలో ప్రమాదాల నివారణకు యాజమాన్యాలు ఎటువంటి ముందు జాగ్రత్తలు పాటించడం లేదన్నారు. యాజమాన్యాల నిర్లక్ష్యం కారణంగా తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని తెలిపారు. ఉపాధి కోసం దూర ప్రాంతాల నుంచి ఇక్కడికి వచ్చిన కార్మికులు ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పరిశ్రమల ప్రమాదాలపై సేఫ్టీ ఆడిట్ నిర్వహించాలని, అందులో వచ్చిన లోపాలపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఫ్యాక్టరీ ఇన్‌స్పెక్టర్ నిరంతరం తనిఖీలు చేపట్టి పరిశ్రమల భద్రత ప్రమాణాలు పాటించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇటీవల జిఎంఎఫ్‌సి ఫార్మా పరిశ్రమలో జరిగిన ప్రమాదంపై విచారణ చేపట్టి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.


కలెక్టర్‌కు సమస్యను విన్నవిస్తున్న సిఐటియు నేత రాము


నినాదాలు చేస్తున్న నేవీ నిర్వాసితులు

99వ రోజుకు నేవీ నిర్వాసితుల ఆందోళన

ప్రజాశక్తి- రాంబిల్లి

తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మండలంలోని వాడనర్సాపురం గ్రామం వద్ద ఎన్ఎఒబి ప్రధాన గేట్ ముందు 8 గ్రామాల నేవీ నిర్వాసితులు చేపట్టిన ఆందోళన సోమవారం నాటికి 99వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా నేవీ నిర్వాసిత జెఎసి నాయకులు మాట్లాడుతూ తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని ఆందోళన చేస్తున్నా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు, జిల్లా అధికారులు పట్టించుకోకపోవడం దుర్మార్గమన్నారు. తాము శారదా, వరాహ నదుల్లో వేటకు వెళ్లి తమ జీవనాన్ని కొనసాగించేవారమని, ఇప్పుడు నేవీ అనుమతి ఇవ్వకపోవడంతో ఉపాధి కోల్పోయి రోడ్డు పడ్డామని ఆవేదన వ్యక్తం చేశారు. 100 రోజులుగా పనులేక పస్తులుంటున్నామని వాపోయారు. ఒప్పందం మేరకు తక్షణమే జెట్టీ నిర్మించాలని, అంత వరకు ఆధార్ కార్డు ఆధారంగా నేవీ గేట్ లోపల నుంచి చేపల వేటకు అనుమతించాలని కోరారు.

పట్టాలు మంజూరు చేయాలని వినతి

ప్రజాశక్తి-అనకాపల్లి : జిల్లాలోని మాకవరపాలెం మండలం రాచపల్లి శివారు ఎరకన్న పాలెంలో సుమారు నాలుగు దశాబ్దాలుగా సర్వే నెంబర్ 7-37లో సాగు చేస్తున్న ఎస్సీ ఎస్టీలను సాగుదారులుగా గుర్తించి వారికి పట్టాలు మంజూరు చేయాలని సోమవారం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. సదరు భూములకు బి మెమోలు, శిస్తు రసీదులు పొంది భూములు అనుభవిస్తున్నామని వారు పేర్కొన్నారు. పండ్ల తోటల పెంపకం కింద డిఆర్డిఎ, ఎస్సీ కార్పొరేషన్, హార్టికల్చర్ రుణాలు కూడా మంజూరు చేసినట్లు తెలిపారు. మండల రెవెన్యూ అధికారులు సాగు హక్కు పత్రాలు ఇచ్చినప్పటికీ నేటికీ పట్టాలు మంజూరు చేయకపోవడం అన్యాయమన్నారు. దీనిపై పలుమార్లు ఆర్డీవో, తహశీల్దార్ కార్యాలయాల్లో వినతిపత్రం అందజేసినట్లు పేర్కొన్నారు. దీనిపై హైకోర్టును ఆశ్రయించగా 2016లో ఆర్డర్ ఒక్కొక్కరికి మూడు ఎకరాలకు ఇచ్చారని, ఈ నేపథ్యంలో సాగుదారుల సమక్షంలో సర్వే నిర్వహించి పట్టాలు ఇప్పించాలని కోరారు.

ఘనంగా గుర్రాల వాసు జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-అనకాపల్లి : టిఎన్‌టియుసి అధికార ప్రతినిధి గుర్రాల వాసు జన్మదిన వేడుకలు అనకాపల్లి టిడిపి పార్లమెంటరీ పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు బుద్ద నాగ జగదీశ్వరరావు సమక్షంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాగ జగదీష్ వాసుకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ సాలువ కప్పి నూకాంబిక అమ్మవారి చిత్రపటాన్ని బహూకరించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి కిడారి శ్రావణ్ కుమార్, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి, టిడిపి చోడవరం నియోజకవర్గం ఇన్‌ఛార్జి బత్తుల తాతయ్యబాబు, జిల్లా నాయకులు కొట్ని బాలాజీ, బోడి వెంకటరావు పాల్గొన్నారు.

గ్రామ కంఠం అమ్మకంపై ఫిర్యాదు

ప్రజాశక్తి- దేవరాపల్లి : మండలంలోని నాగయ్యపేట గ్రామపంచాయతీ పరిధిలోని సర్వే నెంబర్ 384లో గ్రామకంఠం స్థలాన్ని అమ్మకం జరిపారంటూ పంచాయతీ ఉప సర్పంచ్, వార్డు మెంబర్లు, కొంతమంది గ్రామ పెద్దలు సోమవారం పంచాయతీ కార్యదర్శికి, ఈఓపిఆర్డి కె.ఉషాశ్రీకు ఫిర్యాదు చేశారు. ఈ విషయమై దర్యాప్తు నిర్వహించి, గ్రామ కంఠస్థలాన్ని కాపాడాలని వారు కోరారు. ఈ విషయమై జిల్లా కలెక్టర్‌కు, ఆర్డీఓకు ఫిర్యాదు చేసినట్లు వారు పేర్కొన్నారు.

కాంగ్రెస్ బలోపేతానికి కృషి

పిసిసి అధ్యక్షులు గిడుగు రుద్రరాజు


పాదయాత్ర చేస్తున్న రుద్రరాజు, కాంగ్రెస్ నాయకులు

ప్రజాశక్తి-అనకాపల్లి

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్నట్లు ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు గిడుగు రుద్రరాజు అన్నారు. కాంగ్రెస్ పార్టీ జాతీయ నాయకులు రాహుల్ గాంధీ చేపట్టిన జోడో యాత్రకు మద్దతుగా అఖిల భారత కాంగ్రెస్ పార్టీ ఆదేశాల మేరకు కాంగ్రెస్ పార్టీ శ్రేణుల ఆధ్వర్యంలో సోమవారం అనకాపల్లిలో పాదయాత్ర నిర్వహించారు. స్థానిక గుండాల వీధి జంక్షన్ నుంచి ప్రారంభించి నెహ్రూ చౌక్ జంక్షన్ మీదుగా జీవిత బీమా కార్యాలయం వరకు ఈ పాదయాత్ర సాగింది. ఈ సందర్భంగా రుద్రరాజు మాట్లాడుతూ రాహుల్ గాంధీ 3750 కిలోమీటర్లు పాదయాత్ర చేపట్టారన్నారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం మత విద్వేషాలు రెచ్చగొడుతుందని, నిత్యవసర వస్తువుల ధరలు తగ్గించడంలో విఫలమైందని విమర్శించారు. అదానీ సంస్థలపై హిండెన్ బర్గ్ ఇచ్చిన నివేదికపై సంయుక్త పార్లమెంటరీ కమిటీ, లేదా దేశ అత్యున్నత న్యాయస్థానం ప్రధాన జడ్జితో నిష్పాక్షిక విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కొప్పుల రాజు, రాకేష్ రెడ్డి, మీసాల సుబ్బన్న, వెంకటేష్, గుత్తుల శ్రీనివాస్, శ్రీరామ్మూర్తి, దత్తు, బొడ్డు శ్రీనివాస్, బోయిన భానుమూర్తి యాదవ్, మలుపు రెడ్డి కోటేశ్వరరావు, పడాల కొండలరావు, కాళ్ల వెంకట సత్యనారాయణ, కత్తెర శ్రీధర్, కిముడు దేవి, జగత శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

చౌడువాడను అభివృద్ధి చేస్తా

ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు

ప్రజాశక్తి-కె.కోటపాడు

మండలంలోని అతిపెద్ద చౌడువాడ పంచాయతీని అన్ని విధాల అభివృద్ధి చేస్తానని ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు పేర్కొన్నారు. సోమవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా చౌడువాడతో పాటు గరుగుబిల్లిలో ఆయన పర్యటించారు. ప్రజల సమస్యలను తెలుసుకుని పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు చెప్పారు. విశాఖ రాజధానితో గ్రామాలకు మహర్దశ పడుతుందన్నారు. అనంతరం గ్రామంలోని ప్రాథమిక పాఠశాల, అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించారు. చిన్నారులకు అందుతున్న పౌష్టికాహారంపై ఆరా తీశారు. చౌడువాడలో కోటి 70 లక్షల రూపాయలతో నూతనంగా నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రెడ్డి జగన్మోహన్, శివాజీ రాజు, ఎంపిటిసీలు రొంగలి సూర్యనారాయణ, ఏటుకూరు రాజేష్, ఆర్ అండ్ బి డిఈ విద్యాసాగర్, ఏఈ జ్ఞానేశ్వరరావు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.


పిహెచ్‌సి నూతన భవనాన్ని ప్రారంభిస్తున్న డిప్యూటీ సిఎం బూడి

భోగాపురంలో రెండు గ్రూపుల మధ్య భూ వివాదం

ప్రజాశక్తి-అచ్యుతాపురం

మండలంలోని భోగాపురం గ్రామంలో సోమవారం మధ్యాహ్నం భూతగాద విషయమై రెండు గ్రూపుల మధ్య వివాదం చెలరేగింది. వివాదానికి దారి తీసిన భూమిలో వందలాదిమంది స్థానికులు స్థానికేతర్లు గుమ్మిగూడారు. ఒకరిపై మరొకరు రాళ్ళు, కుర్చీలు విసురుకున్నారు. రెండు వర్గాలకు చెందిన వారు కోర్టు తీర్పు తమకు వచ్చిందని ఒకరు, మాకే వచ్చిందని మరొకరు చెబుతున్నారు. ఉద్రిక్త వాతావరణం నెలకొనడంతో పోలీసులు బందోబస్తు ఏర్పాట్లు చేశారు. ఏ సమయంలో ఏం జరుగుతుందోనని అందరూ చూస్తున్నారు. డిఎస్‌పి శ్రీనివాసరావు, సిఐ మురళి రావు తదితరులు శాంతిభద్రతలు లోపించకుండా ముందస్తు జాగ్రత్తలు చేపడుతున్నారు.


సాధించిన షీల్డ్, సర్టిఫికెట్లు చూపుతున్న విద్యార్థులు

కరాటేలో సెయింట్ జాన్స్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-కశింకోట

రేయన్ రే సోటాకన్ కరాటే ఇండియా ఆధ్వర్యంలో ఈనెల 5న జరిగిన సెకండ్ ఇంటర్ కరాటే ఛాంపియన్ షిప్ పోటీల్లో సెయింట్ జాన్స్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ప్రథమ స్థానంలో ఎ.సంజన, ఎ.లోహిత్, ద్వితీయ స్థానంలో ఆర్.నివేద, శ్రీనివాస్, తృతీయ స్థానంలో శ్రేషెంకి గెలుపొందారు. అనకాపల్లి జిల్లాలో మొదటి స్థానంలో నిలిచిన వీరిని పాఠశాలలో సోమవారం ప్రిన్సిపాల్ మహేష్, కరాటే కోచ్ సిహెచ్.అప్పారావు, అకాడమిక్ ఇన్‌ఛార్జి రూపానంద్ అభినందించారు.


తహశీల్దారుకు వినతిపత్రం ఇస్తున్న సర్పంచ్ లావణ్య తదితరులు

చెరువు ఆక్రమణలు తొలగించి హద్దులు గుర్తించాలని వినతి

ప్రజాశక్తి- సబ్బవరం : మండలంలోని బంగారమ్మపాలెం గ్రామంలోని సోమునాయుడు చెరువు గర్భంలో ఆక్రమణలు తొలగించి, హద్దులను గుర్తించాలని ఆ గ్రామ సర్పంచ్ దాడి లావణ్య కన్నం నాయుడు స్థానిక తహశీల్దార్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బంగారమ్మ పాలెం రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్లు 49, 52లలో గల స్వామి నాయుడు చెరువు కొంత కాలంగా ఆక్రమణలకు గురైనట్లు తెలిపారు. చెరువు విస్తీర్ణంను, హద్దులను గుర్తించి తక్షణమే రైతులకు అప్పగించాలని కోరారు. చెరువు ఆయకట్టు రైతులు తరపున జిల్లా కలెక్టర్‌కు కూడా స్పందనలో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

భోజనశాల నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి- బుచ్చయ్యపేట

మండలంలోని దిబ్బిడి బ్లెస్సింగ్ చర్చ్ ఆవరణలో విశాఖ డెయిరీ మాజీ ఛైర్మన్ ఆడారి తులసీరావు జ్ఞాపకార్థం భోజనం శాల నిర్మాణానికి డెయిరీ ఛైర్మన్ ఆడారి ఆనంద్ కుమార్ సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆడారి తులసీరావు రైతుల కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టారని తెలిపారు. చర్చ్‌లో సేవకుల అవసరాలకు అనుగుణంగా భోజనశాలను పూర్తిస్థాయిలో నిర్మాణం చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, వైస్ ఎంపీపీ గొంప చినబాబు, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షులు దేవర అప్పారావు, కో-ఆపరేటివ్ అధ్యక్షులు సుంకరి శ్రీను, దిబ్బిడి సర్పంచ్ పెదిరెడ్ల మాణిక్యం, వైసిపి మండల వర్కింగ్ ప్రెసిడెంట్ నమ్మి అప్పలరాజు, మాజీ సర్పంచ్ సుంకర సత్యనారాయణ, బ్లెస్సింగ్ చర్చ్ పాస్టర్ రాజేష్, పలువురు నాయకులు పాల్గొన్నారు.


శంకుస్థాపన చేస్తున్న విశాఖ డెయిరీ ఛైర్మన్ ఆనందకుమార్



ధర్నా చేస్తున్న సిపిఐ నాయకులు, కార్యకర్తలు

జగనన్న ఇళ్లకు రూ.5 లక్షలు ఇవ్వాలని ధర్నా

ప్రజాశక్తి-అనకాపల్లి

జగనన్న ఇళ్ల కాలనీ లబ్ధిదారులకు ప్రభుత్వం రూ.5 లక్షలు చొప్పున మంజూరు చేయాలని, టిడ్కో గృహాలను తక్షణమే లబ్ధిదారులకు స్వాధీన పరచాలని కోరుతూ సోమవారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ అనకాపల్లి జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ మాట్లాడుతూ జగనన్న కాలనీ లబ్ధిదారులకు సెంటు స్థలం, లక్షా 80 వేల రూపాయల చొప్పున మంజూరు చేశారని, ఇది నిర్మాణానికి ఏమాత్రం సరిపోదని తెలిపారు. రెక్కాడితే కానీ డొక్కాడని పరిస్థితుల్లో ఉన్న పేదలకు మారుమూల ప్రాంతాల్లో స్థలాలు ఇచ్చారని, ఇంటి అద్దె కట్టలేని పరిస్థితుల్లో సొంత ఇంటి కల నెరవేరుతుందని ఆశతో పేదలు ఉన్నారని తెలిపారు. జగనన్న కాలనీల్లో మౌలిక వసతులు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శులు మాకిరెడ్డి రామునాయుడు, రాజాన దొరబాబు, జోనల్ కార్యదర్శి వైఎన్ భద్రం, జిల్లా కార్యవర్గ సభ్యులు కె.సన్యాసిరావు, జి గురుబాబు, అప్పలరాజు, అర్జున్ రావు, కన్నబాబు, దేవుడు బాబు, కోరిబిల్లి శంకర్రావు, ఎన్ సత్యనారాయణ, వై రాజబాబు పాల్గొన్నారు.

18న వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణం

ప్రజాశక్తి-చోడవరం

స్థానిక మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో ఈ నెల 18న తవీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణాన్ని నిర్వహిస్తున్నట్లు అనకాపల్లి జిల్లా విశ్వ బ్రాహ్మణ సంఘం అధ్యక్షులు దిమిలి రాజేష్ తెలిపారు. ఇందుకు సంబంధించి వాల్ పోస్టర్‌ను సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాజేష్ మాట్లాడుతూ ప్రతి గ్రామాల్లోనూ చేతివృత్తులు చేసుకొనే విశ్వబ్రాహ్మణులు ఐక్యంగా ఉండాలన్నారు. ప్రభుత్వం నుంచి వచ్చే సంక్షేమ పథకాలే కాకుండా ప్రత్యేక రాయితీలు తీసుకురావడానికి కలిసికట్టుగా పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు పట్నాల బ్రహ్మానందం, పాల తీర్థం దుర్గాప్రసాద్, నాని, సూరిబాబు, హరిబాబు, సత్యారావు, చంద్రరావు, గనివాడ నానాజీ, లక్ష్మణ్, చుక్కా సత్యనారాయణ, పొన్నాడ శ్రీను, నాగోజి ప్రసాదు పాల్గొన్నారు.

స్పందన అర్జీలను సత్వరమే పరిష్కరించాలి

ప్రజాశక్తి- అనకాపల్లి

స్పందన కార్యక్రమంలో వచ్చే అర్జీలను సత్వరమే పరిష్కారం చేయాలని కలెక్టర్ రవి పటాన్ శెట్టి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన స్పందన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సమస్య పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలన్నారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ముఖ ఆధారిత హాజరు తప్పనిసరిగా నమోదు చేయాలని సూచించారు. సోమవారం స్పందనలో 200 అర్జీలు వచ్చాయి. ఈ కార్యక్రమంలో జెసి కల్పనా కుమారి, డిఆర్‌ఓ వెంకటరమణ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎస్పీ కార్యాలయంలో.....

ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ గౌతమి సాలి ఆధ్వర్యంలో జరిగిన స్పందన కార్యక్రమంలో 32 ఫిర్యాదులు వచ్చాయి. ఎస్పీ గౌతమి సాలి నేరుగా ఫిర్యాదుదారులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. సంబంధిత అధికారులకు ఫిర్యాదులు చట్ట పరిధిలో పరిష్కరించాలని కోరారు.



బాధితుల సమస్యలు వింటున్న ఎస్‌పి గౌతమిశాలి

గృహ సారథులకు శిక్షణ తరగతులు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్

ప్రజాశక్తి-పరవాడ

మండలంలోని 14 సచివాలయాల పరిధిలో ఉన్న గృహ సారథులకు వెన్నెలపాలెం ఎపి కళ్యాణమండపంలో సోమవారం పరవాడ మండల కన్వీనర్ వెన్నెల సన్యాసిరావు ఆధ్వర్యంలో సోమవారం శిక్షణ తరగతులు నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు మరింత చేరువ చేసే లక్ష్యంతో పని చేయాలని ఉద్దేశంతో ఇటీవల నియమించిన గృహ సారధులకు పార్టీ శిక్షణ కార్యక్రమ నిర్వహిస్తుందని చెప్పారు. ఈనెల 11 నుండి ప్రారంభం కానున్న "మా నమ్మకం నువ్వే జగన్" అనే కార్యక్రమం ద్వారా గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు, వాలంటీర్ల సహాయంతో తమ పరిధిలో గల ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నియోజకవర్గం ఇన్‌ఛార్జి అన్నంరెడ్డి అజయ్ రాజ్, ఎంపీపీ పైల వెంకట పద్మ లక్ష్మీ శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ బూస అప్పలరాజు, సర్పంచ్‌లు సిరిపురపు అప్పల నాయుడు, చింతకాయల సుజాత ముత్యాలు, పెదిశెట్టి పూజ శేఖర్, వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి చుక్క రాము నాయుడు, మండల పార్టీ అధ్యక్షులు కోన రామారావు తదితరులు పాల్గొన్నారు.

ఇఇఎఫ్ఐ వర్కింగ్ కమిటీ సభ్యునిగా సత్యనారాయణ

ప్రజాశక్తి-చోడవరం



ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఇఇఎఫ్ఐ) వర్కింగ్ కమిటీ సభ్యులుగా వ్యాపార సత్యనారాయణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ నెల 5న అమరావతిలో జరిగిన సమావేశంలో ఈ ఎన్నిక జరిగినట్లు సోమవారం సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. దేశ వ్యాప్తంగా అనేక రాష్ట్రాలు నుండి విద్యుత్ ఉద్యోగ సంఘాల నాయకులు దీనికి హాజరైనట్లు పేర్కొన్నారు. ఇఇఎఫ్ఐ అధ్యక్షులు, ఎంపీ ఎలమరీ కరీం మాట్లాడినట్లు, కేంద్ర ప్రభుత్వ విద్యుత్ సంస్కరణలే విద్యుత్ సంస్థల నష్టాలకు ప్రధాన కారణమని, కేవలం కార్పొరేట్ ప్రయోజనాలకే ఈ సంస్కరణలు అమలు చేస్తున్నారని ఆయన పేర్కొన్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వ ప్రైవేటీకరణ విధానాలకు వ్యతిరేకంగా విశాల, విస్తృత ఐక్య ఉద్యమాలకు సమావేశం పిలుపునిచ్చినట్లు వెల్లడించారు. ఇఇఎఫ్ఐ వర్కింగ్ కమిటీ సభ్యులుగా ఎన్నికైన సత్యనారాయణకు యూనియన్ సీనియర్ నాయకులు కె.భాస్కర్ రావు, ఏపీ ఈపీడీసీఎల్ యుఈఈయు (సిఐటియు) అధ్యక్షులు జె.శ్రీనివాస, రాష్ట్ర కమిటీ సభ్యులు అప్పలసూరి, జిల్లా రీజియన్ అధ్యక్ష కార్యదర్శులు ప్రేమ చంద్రశేఖర్, అప్పారావు, జమీలు, నూకరాజు, ఈ శ్రీనివాసరావు తదితరులు అభినందనలు తెలిపారు.

కేంద్ర బడ్జెట్‌లో రైతులు, గ్రామీణ పేదలకు అన్యాయం

ఎపి కౌలు రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బాలకృష్ణ

ప్రజాశక్తి-అనకాపల్లి

కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన 2023-24 బడ్జెట్‌లో రైతాంగం, గ్రామీణ పేదలకు తీవ్ర అన్యాయం చేసేదిగా ఉందని ఎపి కౌలు రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.బాలకృష్ణ విమర్శించారు. స్థానిక దొడ్డి రాము నాయుడు కార్మిక కర్షక నిలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ బిజెపి పాలకులు కార్పొరేట్ కంపెనీలకు కొమ్ము కాస్తూ వ్యవసాయ రంగాన్ని నిర్లక్ష్యానికి గురి చేశారన్నారు. దీంతో రైతాంగం మరింత సంక్షోభానికి గురై ఆత్మహత్యలకు పాల్పడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రధానంగా కౌలు రైతులకు బడ్జెట్లో ఎటువంటి సౌకర్యాలు కల్పించలేదన్నారు. సంఘం జిల్లా అధ్యక్షులు కాండ్రేగుల రాము మాట్లాడుతూ బడ్జెట్‌కు వ్యతిరేకంగా ఈనెల 9న అఖిలభారత రైతు సంఘాల సమన్వయ సమితి పిలుపుమేరకు దేశవ్యాప్తంగా బ్లాక్‌డే నిర్వహిస్తున్నామని, ఇందులో రైతులు, కూలీలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.



మాట్లాడుతున్న బాలకృష్ణ, చిత్రంలో రాము

ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలి



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపిపి తదితరులు

ప్రజాశక్తి-సబ్బవరం

మండలంలోని ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేసి రైతులకు ఆసరాగా నిలవాలని ఎంపీపీ బోకం సూర్యకుమారి రామునాయుడు వ్యవసాయ శాఖ సిబ్బందికి సూచించారు. మండలంలోని గుల్లేపల్లి గ్రామంలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ జరుగుతున్న తీరును సోమవారం ఆమె పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో ఇంకా ధాన్యం అమ్మదల్చిన రైతాంగాన్ని అప్రమత్తం చేస్తూ ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ఈనెల 15 నాటికి మొత్తం ధాన్యం కొనుగోలు ప్రక్రియను పూర్తి చేసే విధంగా చూడాలని కోరారు. ఇప్పటివరకు మండలంలో దాదాపు 300 మెట్రిక్ టన్నులు ధాన్యాన్ని కొనుగోలు చేశారని, ఇంకా 320 మెట్రిక్ టన్నులు వరకు కొనుగోలు చేయాల్సి ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ దేవుడు బాబు, ఎడ్ల నాయుడు, ఎఈఓ బాలరాజు, పిఎసిఎస్ సిబ్బంది రామకృష్ణ, రాజు, విఎఎ హేమలత పాల్గొన్నారు.

ట్రాక్టరు బోల్తా పడి డ్రైవర్ మృతి

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట

మండలంలోని రాజాం గ్రామ సమీపంలో సోమవారం ట్రాక్టర్ ఇంజన్ బోల్తా పడి డ్రైవర్ మృతి చెందగా, మరో వ్యక్తికి గాయాలయ్యాయి. పోలీసుల కథనం ప్రకారం... పరవాడ మండలం బర్రింకం గ్రామానికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ గనిరెడ్డి సత్యారావు (43), తన బంధువైన బుచ్చయ్యపేట మండలం రాజాం గ్రామానికి సంకర సత్యారావు చోడవరం మండలం బెన్నవోలు నుండి రాజాం గ్రామానికి ట్రాక్టర్‌పై ఎండు గడ్డి తీసుకొచ్చారు. తొట్టెను అక్కడ విడిచిపెట్టి ఇంజన్‌పై వస్తుండగా రాజాం సమీపంలో అది బోల్తా పడింది. సత్యారావుపై ట్రాక్టర్ ఇంజన్ పడడంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. పక్కన ఉన్న సుంకర సత్యారావు గాయాలతో బయటపడ్డాడు. గనిరెడ్డి సత్యారావు మృతదేహాన్ని పోలీసులు అనకాపల్లి ఎన్టీఆర్ ఏరియా ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. మృతుని కుటుంబీకుల ఫిర్యాదు మేరకు బుచ్చయ్యపేట ఎస్సై కుమారస్వామి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అక్రమంగా మట్టి తరలిస్తున్న జెసిబి, ట్రాక్టరు సీజ్

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని ఆరిపాక పంచాయతీ పరిధిలోని వెంకటరావు చెరువులో అక్రమంగా మట్టి తవ్వి తరలిస్తుండగా దాడి చేసి జెసిబి, ట్రాక్టరును సీజ్ చేసినట్లు స్థానిక సిఐ పి.రంగనాథం తెలిపారు. వెంకటరావు చెరువులోని మట్టిని ఎటువంటి అనుమతులు లేకుండా కొంతమంది తవ్వి ఇటుకలు బట్టీలకు తరలించడంతో గ్రామస్తుల ఫిర్యాదు మేరకు ఈ దాడి చేసినట్లు వెల్లడించారు. సీజ్ చేసిన జెసిబి, ట్రాక్టును స్థానిక తహశీల్దార్‌కు, భూగర్భ గనుల శాఖ అధికారులకు అప్పగించినట్లు తెలిపారు. ట్రాక్టర్ డ్రైవర్ శరగడం రాంబాబు, జెసిబి డ్రైవర్ మళ్ల సాయి కుమార్‌పై కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.

డిగ్రీ కళాశాల అభివృద్ధి పనులపై సమావేశం

ప్రజాశక్తి-సబ్బవరం : స్థానిక డిగ్రీ కళాశాలలో (సిపిడిసి) అభివృద్ధి పనులపై ప్లానింగ్ డెవలప్‌మెంట్ కమిటీ సమావేశం సోమవారం నిర్వహించారు. ప్రిన్సిపాల్ బి.శంకర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో కళాశాల అభివృద్ధి కార్యక్రమాలు గురించి చర్చించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ శంకర్ మాట్లాడుతూ విద్యార్థులకు తాగునీటి సమస్య ఎక్కువగా ఉందని గుర్తించామని, వీలైనంత త్వరగా ఆర్‌ఒ ప్లాంట్ ఏర్పాటు చేయాలని నిర్ణయించామని చెప్పారు. బెంచీలు, ఫర్నిచర్ ఏర్పాటు చేయాలని కమిటీ నిర్ణయించిందన్నారు. విద్యార్థులు అత్యధికంగా ఉండడం వల్ల తరగతి గదులు సరిపోవడం లేదని, కొంతమంది విద్యార్థులకు మధ్యాహ్నం విద్యా బోధన చేయాల్సి వస్తుందని, మరో నాలుగైదు తరగతి గదులు నిర్మించాలని కోరినట్లు తెలిపారు. ఈ కమిటీలో చర్చించిన విషయాలను ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్ రాజ్ దృష్టికి తీసుకెళ్లి పనులు జరిగేటట్లు చూడాలని నిర్ణయించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో సిపిడిసి కమిటీ సభ్యులు కొటాన రాము, గవర శ్రీనివాసరావు, డాక్టర్ జి.వెంకటేశ్వరరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

గుర్రపు గెడ్డపై వంతెన నిర్మించాలని ధర్నా

ప్రజాశక్తి-వడ్డాది : బుచ్చయ్యపేట మండలం, పొట్టిదొరపాలెం గ్రామంలో ఉన్న గుర్రపు గెడ్డ కాలువపై వంతెన నిర్మించి రైతులను ఆదుకోవాలని కోరుతూ జనసేన నాయకులు సోమవారం గెడ్డ వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా జనసేన చోడవరం నియోజకవర్గం అధ్యక్షులు జెర్రిపోతుల నానాజీ మాట్లాడుతూ గెడ్డపై వంతెన నిర్మాణం గురించి గతం, ప్రస్తుతం అధికారంలో ఉన్న నాయకులు మాట ఇచ్చి ఓట్లు వేయించుకున్నారని, కాని నేటికీ దాని నిర్మాణ జాడ లేదని తెలిపారు. గెడ్డ దాటి నిమ్మలోవ బట్లోవా గ్రామాలకు వెళ్లాలని, అనేక మంది రైతులు పొలం పనులు చేసుకోలేని పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు. గొర్రెలు, మేకలు, పశువులు గెడ్డ దాటితేకాని కడుపునిండని పరిస్థితి ఉందన్నారు. వర్షాలకు నీరు ఉధృతంగా ప్రవహిస్తే రాకపోకలు సాగడం లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి శాశ్వత నిర్మాణం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు మండపాక బాబురావు, రైతులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న రైతులు, జనసేన నాయకులు

విద్యుత్ తీగలు మార్చాలని..

సిపిఎం ఆధ్వర్యాన ఆందోళన

ప్రజాశక్తి-రోలుగుంట: మండలంలోని ఆర్ల పంచాయతీ ఆర్ల గ్రామంలో వేలాడుతున్న విద్యుత్ వైర్లను మార్చాలని సిపిఎం ఆధ్వర్యంలో సోమవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం మండల నాయకులు ఈరెల్లి చిరంజీవి మాట్లాడుతూ, గ్రామంలో 25 సంవత్సరాల కిందటే నిర్మించిన ఎలక్ట్రికల్ పోల్స్, వైర్లు గ్రామంలో ప్రమాదంగా ఉన్నాయన్నారు. కరెంటు వైర్లు పెంకుటిల్లు, మేడలపై వాలి ఉన్నాయని, వర్షం పడినప్పుడు మరింత ఇబ్బందిగా ఉంటుందన్నారు. చిన్న పిల్లలు మెడ ఎక్కినప్పుడు చేతికి అందే విధంగా ఉన్నాయని, దీంతో ప్రమాదం జరిగే అవకాశం ఉందన్నారు. తక్షణమే విద్యుత్‌శాఖ అధికారులు స్పందించి ఈ సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు పోతురాజు, రామారావు, నూకరాజు తదితరులు పాల్గొన్నారు.



వేలాడుతున్న విద్యుత్ తీగల వద్ద ఆందోళన చేపడుతున్న సిపిఎం నాయకులు, గ్రామస్తులు



ఆసుపత్రికి వెళ్తున్న రోగులు

కంటి శస్త్ర చికిత్సలకు రోగుల తరలింపు

ప్రజాశక్తి -నక్కపల్లి: వైయస్సార్ కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా సోమవారం నక్కపల్లి సి హెచ్‌సిలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కంటి శస్త్ర చికిత్సా శిబిరం నుండి 22 మంది వృద్ధులను కంటి ఆపరేషన్లకు విశాఖపట్నం ప్రభుత్వ ప్రాంతీయ నేత్ర వైద్యశాలకు తరలించారు. నియోజకవర్గ కంటి వెలుగు ఆప్తాల్మిక్ ఆఫీసర్ మజ్జి గణపతిరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ క్యాంప్‌లో సుమారు 46 మందికి నేత్ర పరీక్షలు చేశారు. విజన్ సెంటర్ సిబ్బంది కస్తూరి చంటి, వైద్య సిబ్బంది సేవలందించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి సూపరింటెండెంట్ జనార్దన్ మాట్లాడుతూ, కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నక్కపల్లి సిహెచ్‌సి నుండి ప్రతీ నెలా అత్యధిక సంఖ్యలో ఎన్‌టిఆర్ ఆసుపత్రికి, విశాఖపట్నం ప్రాంతీయ కంటి, శంకర్ ఫౌండేషన్ ఆసుపత్రులకు శస్త్ర చికిత్సలకు అధిక సంఖ్యలో వృద్ధులను తరలిస్తున్నామని తెలిపారు.



నగదు పంపిణీ చేస్తున్న నేతలు

వైఎస్ఆర్ బీమా నగదు పంపిణీ

ప్రజాశక్తి-మాడుగుల: మండల కేంద్రంలోని సోమవారం వైయస్సార్ బీమా నగదు పంపిణీ చేశారు. మాడుగుల గ్రామంలోని అంబేద్కర్ కాలనీకి చెందిన జలగాని నారాయణరావు మరణించడంతో ఆయన భార్య భాగ్యలక్ష్మికి పది వేల రూపాయల నగదు అందించారు మిగిలిన రూ.90,000లు వ్యక్తిగత ఖాతాలో జమ అవుతాయని ప్రజాప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి పెదబాబు, సర్పంచ్ కళావతి, ఎంపిటిసి పొలిమేర విజయలక్ష్మి, పొలిమేర చిన్నారావు, సయ్యపరెడ్డి సత్తిబాబు, పంచాయతీ కార్యదర్శి చీపురుపల్లి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన

ప్రజాశక్తి-నక్కపల్లి: మండలంలోని ఉపమాక పంచాయతీ శివారు కొర్రవానిపాలెం గ్రామానికి రోడ్డు మంజూరు చేస్తానని ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నానని ఎమ్మెల్యే గొల్ల బాబురావు తెలిపారు. కొర్రవానిపాలెం గ్రామానికి తారు రోడ్డు నిర్మాణానికి రూ.84.60 లక్షలు మంజూరైంది. ఈ మేరకు సోమవారం ఎమ్మెల్యే బాబురావు రోడ్డు పనులకు సంబంధించి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు లేకపోవడంతో గ్రామస్తులు ఎన్నో ఏళ్ల నుండి ఇబ్బందులు పడే వారని, ఈ సమస్యను తన దృష్టికి తీసుకు రావడంతో నిధులు మంజూరు చేశానన్నారు. త్వరితగతిన రోడ్డు పనులను ప్రారంభించి పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. రోడ్డు మంజూరు కు కృషి చేసిన ఎమ్మెల్యే బాబూరావు ను గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గొనగాల అప్పలనరస, ఎంపిపి లావణ్య, జడ్పిటిసి కాసులమ్మ, వైస్ ఎంపిపిలు నానాజీ, ఈశ్వరరావు, వైసిపి నాయకులు శీరం నరసింహమూర్తి, దేముళ్ళు, కొప్పిశెట్టి హరిబాబు, కొల్నాటి బుజ్జి, సత్తిబాబు, గొర్ల బాబూరావు, ఉప సర్పంచ్ ప్రగడ వీరబాబు, సత్తిబాబు, తదితరులు పాల్గొన్నారు.



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే బాబూరావు

పశువైద్య సంచార వాహనం ప్రారంభం

ప్రజాశక్తి-ఎస్.రాయవరం: పశువైద్య చరిత్రలో నూతన అధ్యాయం ప్రారంభమైందని పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు తెలిపారు. కొరుప్రోలులోని క్యాంపు కార్యాలయం వద్ద కోటవురట్ల మండలానికి చెందిన వైఎస్సార్ సంచార పశు వైద్యసేవ వాహనాన్ని ఆయన సోమవారం ప్రారంభించారు. వాహనం పనితీరును పశువైద్యశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ సింహాద్రప్పుడు ఎమ్మెల్యేకు వివరించారు. 1962 కాల్ సెంటర్ నెంబరుకు ఫోన్ చేస్తే ఆ ప్రాంతానికి వెళ్లి పశువులకు వైద్యం అందిస్తారని తెలిపారు. ఈ వైద్యసేవ ద్వారా గొర్రెలు, మేకల పెంపకందార్లకు సత్వర వైద్య సేవలు అందుతాయన్నారు. ఈ కార్యక్రమంలో పశువైద్యాధికారులు ప్రతాప్, హరిప్రియ, పడాల్, అనూష, వైసిపి నాయకులు సిద్దాబత్తుల సత్యన్నారాయణ, తుమ్మలపల్లి ఆంజనేయులరావు, పోలిశెట్టి పెద ఈశ్వరరావు, మాతా గుర్నాధరావు పాల్గొన్నారు.

ఆశా కార్యకర్త కామేశ్వరికి నివాళి

ప్రజాశక్తి-గొలుగొండ: స్థానిక పిహెచ్‌సి ఆశా కార్యకర్త, యూనియన్ సీనియర్ నాయకులు కామేశ్వరి సోమవారం తెల్లవారుజామున అనారోగ్యంతో మృతి చెందారు. సిఐటియు, ఆశా కార్యకర్త యూనియన్ నాయకులు ఘనంగా నివాళ్లు అర్పించి సంతాపం తెలియజేశారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా ట్రెజరర్ కెవి.సూర్యప్రభ మాట్లాడుతూ, కామేశ్వరి ఆశా కార్యకర్తగానే కాకుండా స్వచ్ఛంద సంస్థలలో పని చేసి మహిళా సంఘాలను నడిపారన్నారు. ఆశా కార్యకర్తగా నిత్యం ప్రజలకు ఆరోగ్య సేవలు అందించారని కొనియాడారు. కార్మికుల సమస్యలతో పాటు ఐద్వాలో పని చేస్తూ మహిళల హక్కులకై పని చేశారన్నారు. రైతు సంఘం జిల్లా నాయకులు సాపిరెడ్డి నారాయణమూర్తి మాట్లాడుతూ, ఆశా కార్యకర్తగా పనిచేస్తూ అనేక కార్మిక పోరాటాలలో పాల్గొన్నారన్నారని తెలిపారు. కామేశ్వరి మరణం కార్మికులకు తీరని లోటన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు డి.సత్తిబాబు, కార్యదర్శి అడిగర్ల రాజు, నాయకులు కుమారి, సునీల్ పాల్గొన్నారు.



నివాళి అర్పిస్తున్న నాయకులు, ఆశా కార్యకర్తలు

రీ సర్వే నిలిపివేతకు వినతి

ప్రజాశక్తి -కోటవురట్ల: మండలంలోని లింగాపురం గ్రామానికి సంబంధించి దాదాపు 175 ఎకరాల వరకు రైతుల భూమి ప్రభుత్వ భూమిగా చూపి స్తుండటంపై సోమ వారం గ్రామానికి చెందిన రైతులు తహసిల్దారు జానకమ్మకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ, అమ్మకాలు, కొనుగోలు చేసుకుంటున్న భూమిని ప్రభుత్వ భూమిగా అధికారులు గుర్తించడం దారుణమన్నారు. రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారని, అధికారులు తక్షణమే రీ సర్వే నిలిపి వేయాలన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న రైతులు

పూరిల్లు దగ్ధం

ప్రజాశక్తి -యస్.రాయవరం: మండలంలోని సోము దేవపల్లి గ్రామంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పూరిల్లు దగ్ధమైంది. స్థానికుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన బంగారి రమణమ్మ తన ముగ్గురి కుమారులతో కలిసి జీవనం సాగిస్తుంది. రమణమ్మ అచ్యుతాపురం లోని బ్రాండిక్స్ పరిశ్రమలో కూలి పని చేసుకుంటుండగా పెద్ద కుమారుడు గంగరాజు (22) ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నారు. మిగతా ఇద్దరు కుమారులు చదువుకుంటున్నారు. సోమవారం యధావిధిగా వీరంతా పనుల్లోకి వెళ్ళిపోయారు. మధ్యాహ్నం సుమారు రెండు గంటల ప్రాంతంలో ఇంటిలో నుంచి మంటలు వ్యాపిస్తుండగా ఓ మహిళ చూసి గ్రామస్తులకు తెలిపింది. ఇంటిలో బట్టలు, వస్తువులు, ఎనభై వేల నగదు కాలి బూడిదయ్యాయని, ఈ ప్రమాదంలో సుమారు రెండు లక్షల ఎనభై వేల రూపాయల ఆస్తినష్టం జరిగినట్లు అంచనా వేస్తున్నామని వీఆర్వో అప్పారావు తెలిపారు. బాధితురాలు రమణమ్మ మాట్లాడుతూ, ఇల్లు కట్టుకోవడానికి డ్వాక్రా సంఘంలో ఎనభై వేల రూపాయలు అప్పు తెచ్చానని, అవి కూడా మంటలకు ఆహుతి అయ్యాయని భోరున విలపించింది.



దగ్ధమైన పూరిల్లు

నీటి ప్రాముఖ్యతపై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్: మండలంలోని వేముల పూడి జెడ్పీ హైస్కూల్ విద్యార్థులతో ఏఐఎఎల్ఎ సంస్థ, అంగన్వాడీలు సంయుక్తంగా నీటి ప్రాముఖ్యతపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్.మోహన్ రావు మాట్లాడుతూ, ప్రతి ఒక్కరు పరిశుభ్రత గల కాచి చల్లార్చిన నీటిని తాగాలన్నారు. నీటిని పొదుపుగా వాడాలన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. విద్యార్థులు చదువుపై శ్రద్ధ చూపి భవిష్యత్తులో ఉన్నత స్థానాలను అధిరోహించాల న్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ రవి, ఉపాధ్యాయులు సురేష్, ఏఐఎఎల్ సంస్థ ప్రతినిధి ఎన్. త్రిమూర్తులు, అంగన్వాడీలు బి.రేవతి, బి.లక్ష్మీ, సరోజ, కె.దేవి, దేవుడమ్మ, ఆశాజ్యోతి, ఎర్రయ్యమ్మ, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

ప్రజాశక్తి-రోలుగుంట: మండలంలోని బుచ్చింపేట గ్రామ పంచాయతీకి చెందిన వార్డు సంక్షేమ అభివృద్ధి కార్యదర్శి అనిమిరెడ్డి రమణ తన సేవా కార్యక్రమంలో భాగంగా తన సొంత నిధులతో సుమారు 150 మంది పేద విద్యార్థులకు సైన్ ఇండియా మంత్లీ మ్యాగజైన్ పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామ వార్డు సచివాలయం ఫెడరేషన్ జాయింట్ సెక్రెటరీ కర్రి రాజేష్ పాల్గొన్నారు.



పుస్తకాలు ఇస్తున్న రమణ, తదితరులు

రూ.15 వేల కోట్ల కేటాయింపుపై హర్షం

ప్రజాశక్తి-గొలుగొండ

కేంద్ర బడ్జెట్‌లో గిరిజన సంక్షేమం కోసం రూ.15 వేల కోట్లు కేటాయింపుపై జాతీయ అల్లూరి సీతారామరాజు యువజన సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు పడాల వీరభద్రరావు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకర్లతో సోమవారం మాట్లాడుతూ, గతంలో రూ.7,484 కోట్లు కేటాయించగా ఈ సారి 15వేల కోట్లు కేటాయించడం జరిగిందని ఆయన పేర్కొన్నారు. గతంలో కేటాయించిన 7,484 కోట్ల బడ్జెట్లో 6,128 కోట్లు ఖర్చు చేశారన్నారు. ఆదివాసీ యువత అభివృద్ధి నిమిత్తం, ఏకలవ్య ఆశ్రమ పాఠశాలలకు 400 కోట్లు కేటాయిస్తే ఆ నిధులు కూడా పక్కదారి పట్టాయని ఎద్దేవా చేశారు. ఈసారైనా 15 వేల కోట్ల నిధులు పక్కదారి పట్టకుండా పూర్తిగా ఆదివాసీల అభివృద్ధికి ఖర్చు చేసేటట్లు చర్యలు తీసుకోవాలన్నారు. పాడేరు నుండి రంపచోడవరం నియోజకవర్గం ఎటపాక వరకు రహదారుల నిర్మాణాలు, విద్య, వైద్య భవన నిర్మాణాలు, గిరిజన ఉపాధి కోసం చిన్న తరహా పరిశ్రమలు ఏర్పాటుకు ఈ నిధులు వినియోగించాలని కోరారు.

పిత్రిగెడ్డలో ఆర్‌డిఒ జయరాం పర్యటన

ప్రజాశక్తి -రోలుగుంట: మండలంలోని ఆర్ల శివారు కొండలపై ఉన్న గిరిజన గ్రామం పిత్రిగెడ్డను సోమవారం నర్సీపట్నం ఆర్‌డిఒ హెచ్‌వి జయరాం సందర్శించారు. తమకు కనీస మౌలిక వసతులు లేక ఇబ్బందులు పడుతున్నామని ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతూ పలు పత్రికల్లో వచ్చిన కథనాల నేపథ్యంలో రోలుగుంట తహశీల్దార్ వెంకటేశ్వరరావు, వైస్ ఎంపిపి రాజులతో కలిసి ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆర్డీవో గిరిజన కుటుంబాలతో మాట్లాడారు. ఏ ప్రభుత్వ పథకాలు అందుతున్నాయో అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆర్డీవో మాట్లాడుతూ, మౌలిక వసతులు కల్పిస్తామని, ప్రభుత్వ పథకాలు అందిస్తామని హామీ ఇచ్చారు.



మాట్లాడుతున్న జయరాం

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక

ప్రజాశక్తి -కొత్తకోట: జాతీయస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు రావికమతం మండలం టి.అర్జాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న రాజాన రమేష్‌నాయుడు, పిల్లా పూర్ణ ఎంపికయ్యారు. ఈ సందర్భంగా పాఠశాల పిఈటి రమేష్ నాయుడు మాట్లాడుతూ, అండర్ -16 విభాగంలో బాల బాలికలకు ఈనెల 16 నుంచి 20 వరకు తెలంగాణ రాష్ట్రం మంచిర్యాలలో ప్రగతి స్టేడియంలో జరిగే జాతీయ స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో వీరు పాల్గొంటారన్నారు. ఇప్పటికే రాష్ట్రస్థాయిలో జరిగిన బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో ఈ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరచడంతో జాతీయస్థాయి పోటీలకు ఎంపిక చేశారని పిఈటి పేర్కొన్నారు. విద్యార్థులను హెచ్‌ఎం కె.ఆర్.ఎస్ నాయుడు, సర్పంచ్ మడగల అర్జున, వైస్ ఎంపిపి ఎం.భవాని ప్రసాద్ అభినందించారు.



ఎంపికైన విద్యార్థులు



ఆనంద్‌కుమార్‌ను సన్మానిస్తున్న నాయకులు


విశాఖ డెయిరీ ఛైర్మన్‌కు సత్కారం

ప్రజాశక్తి-మాడుగుల: విశాఖ డెయిరీ ఛైర్మన్ ఆడారి ఆనంద్ కుమార్‌కు సోమవారం మాడుగులలో పాల సంఘాల అధ్యక్ష కార్యదర్శులు, వైసిపి నేతలు సన్మానం చేశారు. ఈ సందర్భంగా మాడుగుల మండలాలకు చెందిన విశాఖ డెయిరీ పాల కేంద్రాల అధ్యక్ష కార్యదర్శులతో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనకు సత్కారం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి పెదబాబు, సర్పంచ్ కళావతి, ఎంపిటిసి విజయలక్ష్మి, పెరుమాళ్ళ వెంకటరావు, బొమ్మిశెట్టి శ్రీనివాసరావు, గండి జోగినాయుడు, సయ్యపురెడ్డి సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

పార్టీ టిక్కెట్ ఇస్తే పోటీ

- మాజీ ఎమ్మెల్యే, వైసిపి నేత చెంగల

ప్రజాశక్తి - పాయకరావుపేట: పార్టీ ఎమ్మెల్యే టికెట్ ఇస్తే పోటీ చేస్తానని, ఇవ్వకపోతే పార్టీ గెలుపునకు కృషి చేస్తానని మాజీ ఎమ్మెల్యే, వైసిపి నేత చెంగల వెంకటరావు తెలిపారు. సోమవారం స్థానిక జిల్లా పరిషత్ అతిథి గృహంలో స్థానిక పాత్రికేయు లతో మాట్లాడుతూ, తాను గ్రామీణ ప్రాంతాల్లో పర్యటిస్తున్నప్పుడు ప్రజలు చూపుతున్న ఆదర అభిమానాలు మరువ లేనివన్నారు. సుమారుగా రూ.90 కోట్ల నిధులు తీసుకువచ్చి నియోజకవర్గంలో అభివృద్ధి పనులు చేపట్టానన్నారు. ఎక్కడా అవినీతి ఆరోపణలకు తావు లేకుండా పని చేశానన్నారు. తాను ఎమ్మెల్యే టికెట్ ఆశించి నియోజకవర్గంలో పర్యటించ లేదని, మా నాయకుడు ,ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి టికెట్ ఎవరికి ఇచ్చినా తాను చిత్తశుద్ధితో అభ్యర్థి గెలుపు కోసం పని చేస్తానని తెలిపారు.



మరిన్ని విజయాలు సాధించాలి

అల్లూరి విజ్ఞాన కేంద్రం కార్యదర్శి డాక్టర్ బి.గంగారావు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : కానిస్టేబుల్ ప్రాథమిక పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించిన అల్లూరి స్టడీ సర్కిల్ విద్యార్థులను అల్లూరి విజ్ఞాన కేంద్రం కార్యదర్శి డాక్టర్ బి.గంగారావు అభినందించారు. సోమవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులు సానుకూల దృక్పథంతో ఇదే స్ఫూర్తితో శ్రమించి మరిన్ని విజయాలు సాధించాలని కాంక్షించారు. స్టడీ సర్కిల్ నుంచి 12 మంది విద్యార్థులు అర్హత సాధించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. అందరికీ అందుబాటులో నాణ్యమైన విద్యను అందించడమే అల్లూరి స్టడీ సర్కిల్ లక్ష్యమన్నారు. శిక్షణ తరగతులు ప్రారంభించిన అతి తక్కువ కాలంలోనే అరుదైన విజయాలు సాధించినట్లు తెలిపారు .తాజాగా విడుదలైన గ్రూప్ - 1 పరీక్షల్లోనూ ఐదుగురు విద్యార్థులు అల్లూరి స్టడీ సర్కిల్ నుంచి అర్హత సాధించినట్లు తెలిపారు. ప్రస్తుతం గ్రూప్ - 2 శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయని, ఆసక్తిగల వారు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 8008412798 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో విజ్ఞాన కేంద్రం మేనేజర్ కిరణ్ కుమార్, అభిమన్యు పాల్గొన్నారు.




ప్రతిభ కనబరిచిన వారితో గంగారావు

పుష్కరిణి అపారిశుద్ధ్యంపై టిటిడి అధికారుల దృష్టికి తీసుకెళ్తా

ఎమ్మెల్యే బాబూరావు

'ప్రజాశక్తి'లో కథనాన్ని చూపించిన స్థానికులు

ప్రజాశక్తి -నక్కపల్లి : అస్తవ్యస్తంగా ఉపమాక పుష్కరిణి అనే వార్త సోమవారం ప్రజాశక్తిలో ప్రచురణ మవ్వడంతో వైస్ ఎంపిపి నానాజీ, స్థానిక నాయకులు శీరం నరసింహమూర్తి, కొప్పిశెట్టి హరిబాబు, కొల్లాటి బుజ్జి, సత్తిబాబు తదితరులు ఎమ్మెల్యే గొల్ల బాబూరావు దృష్టికి తీసుకువెళ్లారు. ఎమ్మెల్యే బాబూరావు పత్రికలో వచ్చిన కథనాన్ని చదివారు. పుష్కరిణి చాలా అధ్వాన్నంగా ఉందని, వచ్చే నెలలో స్వామివారి వార్షిక కళ్యాణ ఉత్సవాలు ప్రారంభం కానున్నాయని స్థానిక నాయకులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు. సుదూర ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు పుష్కరిణిలో స్నానాలు ఆచరించి స్వామిని దర్శించుకుంటారని, చెరువు అపరిశుభ్రంగా ఉండటంతో స్నానాలు చేయడానికి అవకాశం లేకుండా పోయిందన్నారు. కనీసం కాళ్లు కడుక్కునేందుకు కూడా అవకాశం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. భక్తుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి మార్గం చూపాలని స్థానిక నాయకులు ఎమ్మెల్యేను కోరారు. ఈ మేరకు ఎమ్మెల్యే బాబూరావు మాట్లాడుతూ, టిటిడి డిప్యూటీ ఈవోతో మాట్లాడి చెరువు శుభ్రపరిచే విధంగా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.



ప్రజాశక్తి పత్రికను ఎమ్మెల్యేకు ఇచ్చిన స్థానికులు

పోరాటాలతో 'ఉక్కు'ను కాపాడుకుంటాం

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం): ఐక్య పోరాటాలతో స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకుంటామని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ కో - కన్వీనర్ జె.అయోధ్యరామ్ అన్నారు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు సోమవారానికి 725వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో స్టీల్ సిఐసిసిపి విభాగానికి చెందిన ఉద్యోగులు కూర్చున్నారు. వారినుద్దేశించి ఆయన మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ నిర్వీర్యానికి కేంద్రం అనేకరకాలుగా కుట్రలు పన్నుతోందన్నారు. అయినప్పటికీ కార్మికులు రెండేళ్లుగా దీక్షలు, పోరాటాలు కొనసాగిస్తూ ప్లాంట్ జోలికి ప్రైవేటు శక్తులు రాకుండా కాపాడుకోగలిగారని తెలిపారు. ఇదే స్ఫూర్తిని భవిష్యత్తులోనూ కొనసాగించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఉక్కు పరిరక్షణ విషయమై కేంద్రంపై ఒత్తిడి పెంచాలన్నారు. రచయిత్రి దేవి దీక్షలకు మద్దతు తెలిపి మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ కార్మికులు చేస్తున్న పోరాటం ఉక్కు చరిత్రలో మైలురాయిగా నిలిచిపోతుందని తెలిపారు. రచయితల తరపున ఎల్లప్పుడూ సహకారం ఉంటుందని అన్నారు. దీక్షల్లో నాయకులు కె.బాబూరావు, తాండ్ర కనకరాజు, ఎస్.జ్యోతి ప్రసాద్, శివరామకృష్ణ, ఎం.శ్రీనివాస్, కొమ్ము ప్రసాద్, సుబ్బారావు, కె.ఆనంద్ కుమార్, టివికె.రాజు, ఎస్ఎన్.మూర్తి, కొల్లి నాగేశ్వరరావు పాల్గొన్నారు. సోమవారం ఉక్కు దీక్షలకు మద్దతు తెలిపిన వారిలో ప్రజా రచయిత్రుల వేదిక (ప్రవే) జాతీయ అధ్యక్షురాలు మల్లీశ్వరి, తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి కాత్యాయనీ విద్మహే, ప్రముఖ వకీలు జహరా, శాంతి ప్రబోధ, అరుణ జ్యోతి, తిరునగరి దేవకి ఉన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి -కొత్తకోట: ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్య కరమైన ఆహారం లభిస్తోందని ప్రకృతి వ్యవసాయంపై రైతులు అవగాహన పెంచుకోవాలని మండల వ్యవసాయశాఖ ఎంటి రామలక్ష్మి సూచించారు. రావికమతం మండలం కొత్తకోటలో సోమవారం ప్రపంచం చూపు ప్రకృతి వ్యవసాయం వైపు' అనే నినాదంతో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థుల తో భారీ ర్యాలీ, మానవ హారం నిర్వహించారు. అనంతరం పలువురు రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు..ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, వరి పంటకు ముందు ఖాళీ భూముల్లో 9 రకాల విత్తనాలు చల్లు కోవాలని, తడి మడులను దమ్ము పట్టు కోవాలన్నారు. దీంతో పంటకు కావాల్సిన పోషకాలు అందడంతో పాటు పెట్టు బడి తగ్గుతోందని పేర్కొన్నారు. అంతక ముందు నిర్వహించిన ర్యాలీ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం డి.సత్యారావు, గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్ కోన లోవరాజు, పి.దేవ, పాఠశాల కమిటీ ఛైర్మన్ అడ్డూరి నానాజీ, గ్రామ వ్యవసాయాధికారి శ్రీను, సుధారాణి పలువురు గ్రామ స్థాయి సిబ్బంది పాల్గొన్నారు.



ర్యాలీ చేపడుతున్న పాఠశాల సిబ్బంది, విద్యార్థులు

పెద్దేరు ఎడమ కాలువ నిర్మించాలి

ప్రజాశక్తి-మాడుగుల: ప్రభుత్వం బడ్జెట్‌లో నిధులు కేటాయించి సాగునీటి ప్రాజెక్టులను అభివృద్ధి చేసి నీటిని సరఫరా చేయాలని సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు డి వెంకన్న, గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఈ నరసింహమూర్తి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు భవాని డిమాండ్ చేశారు. మండలంలోని పెద్దేరు ఎడమ కాలువ నిర్వాసిత గ్రామాలలో సోమవారం పర్యటించి గ్రామస్తులతో వారు మాట్లాడుతూ, పెద్దేరు రిజర్వాయర్ నిర్మాణం అయినప్పటికీ ఎడమ కాలువ నిర్మాణం ఇప్పటి వరకు చేపట్టక పోవడంతో సుమారు 6 గ్రామాలకు చెందిన ఎన్నో ఎకరాలు బీడు భూములుగా మారుతున్నాయన్నారు. అనేక సంవత్సరాలుగా ఎడమ కాలువ నిర్మాణం చేపట్టాలని ఈ ప్రాంత గిరిజనులు ప్రభుత్వానికి మొర పెట్టుకుంటున్నా వినడం లేదన్నారు. గత ప్రభుత్వంలో నిధులు కేటాయింపు జరిగినప్పటికీ పనులు పూర్తి కాలేదని తెలిపారు.ఎన్నికల సమయంలో రాజకీయనేతలు హామీలతో హడావిడి చేస్తున్నారు తప్ప పనులు పూర్తి చేయడం లేదని విమర్శించారు. గత ఎన్నికల సమయంలో ఇప్పటి ఉపముఖ్యమంత్రి ముత్యాల నాయుడు ఎడమ కాలువ నిర్మాణం చేపడతామని హామీ ఇచ్చారని, ఇప్పటివరకు నిల బెట్టుకోలేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం దిగివచ్చి ఎడమ కాలువ నిర్మాణం చేపట్టాలని లేని పక్షంలో దీని ప్రతిఫలం ఎదుర్కొనాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పలువురు గిరిజనులు పాల్గొన్నారు.



గ్రామస్తులతో మాట్లాడుతున్న సిపిఎం నేతలు

ఎయు విసి అక్రమాలపై విచారణ జరపాలి



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం): ఆంధ్రా యూనివర్సిటీ విసి ప్రసాద్‌రెడ్డి అక్రమాలపైనా, విద్యార్థి, ఉద్యోగ, అధ్యాపక, ప్రజా వ్యతిరేక విధానాలపైనా ఉన్నత స్థాయి విచారణకు కమిషన్ నియమించాలని, వర్సిటీలో ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరించాలని విద్యార్థి, యువజన, అభ్యుదయ సంఘాల ఐక్యవేదిక డిమాండ్ చేసింది. విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వేదిక తరుపున ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వి.జాన్సన్‌బాబు, ఎస్ఎఫ్ఐ విశాఖ జిల్లా కార్యదర్శి ఎల్‌జె.నాయుడు, ఎయు ప్రొగ్రెసివ్ ఫోరం నాయకులు డాక్టర్ పొన్నాడ శ్రీనివాస్ మాట్లాడారు. ప్రతిష్టాత్మక ఆంధ్రా యూనివర్సిటీ విసి ప్రసాద్‌రెడ్డి పాలనలో అప్రతిష్ట పాలవుతోందన్నారు. విసి విధానాలకు వంత పాడేవారినే పాలకమండలి సభ్యులుగా నియమించుకున్నారని తెలిపారు. నేడు ఎయును ఒక వ్యాపార కేంద్రంగా మార్చేశారన్నారు. వర్సిటీ భూములను విసి తన సొంత మనుషులకు లీజుల పేరిట అప్పగిస్తూ వర్సిటీ భవిష్యత్తును మంటగలుపుతున్నారని మండిపడ్డారు. ఇప్పటికే కొన్ని మెస్‌లను పూర్తిగా ప్రైవేటు వ్యక్తులకు అప్పగించారని చెప్పారు. ఎయును పేదలకు దూరం చేసి, పెద్దలకు చేరువ చేస్తున్నారని విమర్శించారు. మహారాణిపేటలోని ఎయు హాస్టల్స్ స్థలాన్ని అమ్మేసే దిశగా విసి కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. ప్రతిభావంతులైన సుమారు 20 మంది కాంట్రాక్ట్, 260 మంది గెస్ట్ ఫ్యాకల్టీలను అక్రమంగా తొలగించారని తెలిపారు. సమావేశంలో పిడిఎస్‌యు నాయకులు కె.దేవ, టిఎన్ఎస్ఎఫ్ నాయకులు శోభన్ కుమార్, ఎఐఎస్ఎఫ్, ఎఐవైఎఫ్ నాయకులు పాల్గొన్నారు.